ఆదివారం
20-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 208
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ఎలియన్' డిపోర్టేషన్లు వద్దు

అమెరికా సుప్రీంకోర్టు

వాషింగ్టన్: 'ఎలియన్ ఎనిమీస్ యాక్ట్' అనే 18వ శతాబ్దపు చట్టం కింద వెనిజులా పౌరుల డిపోర్టేషన్లు తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా సుప్రీం కోర్టు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు బూ బోనెట్ డిటెన్షన్ సెంటర్‌లోని వెనిజులా ప్రజలను వారి దేశానికి తిప్పి పంపవద్దని ట్రంప్ ప్రభుత్వానికి కచ్చితమైన ఆదేశాలిచ్చింది. ట్రంప్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేసిన జస్టిస్ క్లారెన్స్ థామస్, జస్టిస్ శామ్యూల్ అలిటోతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది.

గగనతలంలో 'స్మైలీ ఫేస్'

న్యూఢిల్లీ: ఎన్నో అద్భుతాలకు నెలవైన ఖగోళంలో ఓ అందమైన దృశ్యం ఆవిష్కృతం కానుంది. సౌరకుటుంబంలోని రెండు గ్రహాలు... చంద్రుడు సమీపంలోకి రానుండటంతో గగనతలంలో 'స్మైలీ ఫేస్' ఏర్పడనుంది. ఏప్రిల్ 25న ఈ దృశ్యం కనిపించనున్నట్లు సైన్స్ వెబ్‌సైట్ లైవ్‌సైన్స్ వెల్లడించింది. ఏప్రిల్ 25న తెల్లవారుజామునకు ముందు శుక్రుడు, శని, చంద్రుడు అతి సమీపంలోకి రానున్నాయి. ఒక దగ్గరే కనిపించనున్న ఆ మూడు... స్మైలీ ఫేస్ ఆకృతిని ప్రతిబింబించనున్నాయి. ఆకాశం నిర్మలంగా ఉంటే...

- మిగతా 2 లో

22న ఇంటర్ ఫలితాలు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఇంటర్ ఫలితాలు ఈ నెల 22న వెలువడనున్నాయి. మొదటి... రెండో సంవత్సర ఫలితాలను ఒకేసారి ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మార్చి ఐదు నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,532 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. 9,96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 4.88 లక్షల మంది మొదటి సంవత్సర విద్యార్థులు కాగా, ఐదు లక్షలకుపైగా రెండో సంవత్సర విద్యార్థులు ఉన్నారు. మార్చి 18 నుంచి మూల్యాంకనం చేశారు.

'నిమ్స్'లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - హైదరాబాద్: నిత్యం రద్దీగా ఉండే నిమ్స్ ఆసుపత్రి ఐదో అంతస్తులో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఎమర్జెన్సీ వార్డులో ఒక్కసారిగా పొగలు రావడంతో రోగులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ప్రాణ నష్టం జరగలేదు. ఎవరూ గాయపడలేదు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్టు తెలిసింది. ఆస్తి నష్టం జరగలేదని అసుపత్రి వర్గాలు తెలిపాయి. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ... ఆసుపత్రి డైరెక్టర్ బీరప్పతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఇదీ లోకం!

తెలంగాణలో త్వరలో డ్రైపోర్టు

ప్రపంచంతో పోటీపడేలా అభివృద్ధి

ఐటీ, ఫార్మా రంగంలో ప్రగతి

జపాన్ తెలుగు సమాఖ్య సదస్సులో సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణను తీర్చిదిద్దుదాం అని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటికే తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని, త్వరలో తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నట్టు వెల్లడించారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ ... నీరు మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని, కాని తమ ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన చేసేందుకు ప్రయత్నిస్తుంటే కొంతమంది అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే దిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి ఏర్పడిందని, కేవలం కాలుష్యంతో దిల్లీ నగరం స్థంభించే పరిస్థితి ఉంటే ... ఇప్పటికీ మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా అని నిలదీశారు. దిల్లీలో పరిస్థితిని చూసే తాను హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన చేయాలని చెబుతున్నానని... మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని పేర్కొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెరగాలి, పరిశ్రమలు పెరగాలి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి మీరు చేతనైనంత సహాయం చేస్తే ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చన్నారు. నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఉన్నారు.

'వసంత హోమ్స్' భారీ షెడ్డు కూల్చివేత

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నెర్ర

2లో

విజయసాయిరెడ్డి చరిత్ర బైటపెడతా

2లో

కూలిన నాలుగంతస్తుల భవనం

11 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. శక్తి విహారం ప్రాంతంలోని ఓ నాలుగు అంతస్తుల భవనం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 11 మందిని సహాయబృందాలు కాపాడాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు అత్యవసర సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ నెట్టింట వైరల్ అవుతోంది. తొలుత భవనంలోని ఒక భాగం అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ మరుక్షణమే మొత్తం భవనం కుప్పకూలింది. క్షణాల వ్యవధిలో భవనం నేలమట్టమైంది. భవనం కూలడంతో భారీ ఎత్తున రేగిన దుమ్ము, ధూళి ఆ ప్రాంతాన్నంతా మేఘంలా ఆవరించింది. చుట్టుపక్కల ఏమున్నదీ కనిపించనంత స్థాయిలో దుమ్ము ఎగసి పడింది. సీసీటీవీ కెమెరాల్లో రికార్డైన ఈ భయానక దృశ్యాలు నెట్టింట కలకలం రేపుతున్నాయి. ఒక్కసారిగా భవనం కూలడంతో శిథిలాల కింద కొంతమంది చిక్కుకుపోయారని పోలీసుల తెలిపారు. 11 మందిని సురక్షితంగా బయటకు తీసుకురాగలిగామని, కొంతమంది శిథిలాల కింద ఉండే అవకాశం ఉందని తెలిపారు. యూపీలోని మీరట్‌లో వెలుగు చూసిన మరో ఘటనలో ఇంటి పైకప్పు కూలి ఓ మహిళ, ఆమె తొమ్మిది నెలల కూతురు దుర్మరణం చెందారు. శుక్రవారం భారీ వర్షం కురవడంతో ఇంటి పై కప్పు కూలింది. లీసాగడీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. బాధితులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు.

70.13 లక్షల మెట్రిక్ టన్నుల

ధాన్యం కొంటాం

- క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షించాలి
- సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో రికార్డ్ స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అవుతుందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రబీ సీజన్‌లో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎర్రమంజిల్‌లోని పౌర సరఫరాల శాఖ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం మధ్యాహ్నం మంత్రి ఉత్తమ్ ... పౌర సరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి డి.ఎస్.చౌహన్, వినియోగదారుల వ్యవహారాలు,ఆహార,పౌర సరఫరాల శాఖ జాయింట్ కమిషనర్ ప్రియాంకా ఏలే, డైరెక్టర్ ప్రసాద్ తదితరులతో కలసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రబీలో రైతాంగం సాగు చేసిన 57 లక్షల ఎకరాలలో 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఖరీఫ్‌లో 66.7 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా కలెక్టర్లు సమీక్షించాలని మంత్రి సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు

- మిగతా 2 లో

రైతు భద్రతకే 'భూభారతి'

- రూపాయి చెల్లించకుండానే సమస్యలకు పరిష్కారం
- 1 నుంచి గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- 26 వేల సాదా బైనామ అర్జీలు పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: భూభారతి చట్టం రైతులకు భద్రత కల్పిస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి రైతుకు భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి భూభారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు శనివారం జోగుళాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలో ఆయన పర్యటించారు. గద్వాల జిల్లా ధరూర్ తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు అవగాహన కల్పించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సాదా బైనామాలతో పాటు ఇతర ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. మే ఒకటో తేదీ నుంచి గ్రామాలకే అధికారులు వచ్చి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ఆధార్ కార్డు వలే భూదార్ కార్డులను ఇస్తామని మంత్రి తెలిపారు. 26 వేల సాదా బైనామ దరఖాస్తులు పరిష్కరిస్తామని అన్నారు. ప్రభుత్వ, అటవీ, ప్రైవేట్ భూములకు గుర్తింపు తెచ్చి భద్రపరుస్తామని పేర్కొన్నారు. అధికారులు మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించరాదని హెచ్చరించారు. ఎంపీ మల్లు రవి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ మాట్లాడుతూ జిల్లాలో జూరాల ప్రాజెక్టు కింద ఆర్ఎన్ఆర్ పరిధిలో ఇళ్లు

- మిగతా 2 లో

విప్ ధిక్కరిస్తే ...

బహిష్కరణే

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీకి దూరం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: త్వరలో జరిగే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీకి దూరంగా ఉండాలని అధిష్టానం నిర్ణయించిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయడం లేదన్నారు. ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎవరైన పార్టీ గీత దాటితే వేటు తప్పదని హెచ్చరించారు. ఓటింగ్‌కు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లకు కేటీఆర్ హుకుం జారీ చేశారు. ఈనెల 24న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో పార్టీ నేతలకు విప్ జారీ చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. విప్ ధిక్కరిస్తే పార్టీ నుంచి బహిష్కరణ తప్పదని కేటీఆర్ మందలించారు. బీజేపీ వద్దు... ఎంఐఎం వద్దు...

- మిగతా 2 లో

వక్ఫ్ చట్టాన్ని తిప్పికొడదాం

- ఉద్యమానికి సీపీఐ నాయకత్వం అవశ్యం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర- హైదరాబాద్ : వక్ఫ్ సవరణ చట్ట వ్యతిరేక ఉద్యమానికి సీపీఐ నాయకత్వం వహించాలని రాజకీయ, ప్రజాసంఘాల నేతలు, మేధావులు అన్నారు. కులమతాలకతీతంగా దేశ పౌరులందరూ ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త రైతు ఉద్యమం తరహాలో మరో పోరాటానికి నాంది పలికి ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిన బూనాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో "వక్ఫ్ సవరణ చట్టం ఎవరి కోసం" అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ, ప్రముఖ సామాజిక శాస్త్రవేత మోటూరి కృష్ణ ప్రసాద్, ఎంబిటి అధికార ప్రతినిధి అహ్మదుల్లా ఖాన్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు, మునీర్ పటేల్, జర్నలిస్ట్, రచయిత స్కైబాబా, భారత జాతీయవాదుల ఉద్యమం, జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అలీ జుబేర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నవీద్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వరంగల్ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఫసియుద్దీన్ ఖాస్మి, ముస్లిం ఐక్యత, అభివృద్ధి ఉద్యమం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ సుభాన్, ఆల్ ఇండియా సూఫీ ఉలేమా కౌన్సిల్, అధ్యక్షుడు మౌలానా ఖైరుద్దీన్ సూ, జామియత్ ఎ అహ్లే హదీస్, తెలంగాణ ప్రతినిధి డాక్టర్ ఆసిఫ్ ఉమ్రీ, జమాత్ ఎ ఉలేమా ఎ హింద్ ప్రతినిధి మెహబూబ్ మదానీలతో పాటు పలువురు మేధావులు హాజరయ్యారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ... ప్రజాధనాన్ని వెచ్చించి మరీ వక్ఫ్ సవరణ చట్టం కేంద్రం సాధించుకుందని విమర్శించారు. బిల్లు ఆమోదం పొందేందుకు అవకాశావాదులైన ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బేరమాడి మరీ వారి డిమాండ్లను నేరవేర్చుకున్న తర్వాతే బిల్లుకు మద్దతును తెలిపారని విమర్శించారు. చట్ట సవరణ అదానీ, అంబానీల కోసమేనని, దేశాన్ని గుజరాతీ వ్యాపారుల నుంచి విముక్తి చేసేందుకు ఉద్యమించాల్సిన సమయం అసన్నమైందన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారని తెలిపారు. న్యాయ పోరాటం, ప్రజా ఉద్యమాలతో కేంద్ర వైఖరిని ఎండగడుతామని చెప్పారు. నరసింహ మాట్లాడుతూ మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను వీడదీసేందుకు కేంద్రం ఎన్ని కుట్రలు పన్నినా సీపీఐ తిప్పి కొడుతుందన్నారు. బోస్ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణతో ప్రధాని మోదీ రాజకీయ జీవితం పరిసమాప్తం కానుందన్నారు. అహ్మదుల్లా ఖాన్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర సీఎంగా 1994లో అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు వక్ఫ్

- మిగతా 2 లో

మిథున్‌కి ముచ్చెమటలు

ఏపీ సిట్ 8 గంటల సుదీర్ఘ విచారణ

2లో

ఎన్నికల చిహ్నాం మారని సీపీఐ

మన దేశంలో రాజకీయ పార్టీలకు కొదవలేదు. చిన్నా పెద్దా అన్ని కలిపితే 1200కు పైనే ఉంటాయని ఓ అంచనా. ఇందులో ఎప్పుడూ ఎక్కడా ఒక్క స్థానమైనా గెలవని పార్టీలూ ఉన్నాయి. అసలు ఎన్నికలలో ఎప్పుడూ పోటీ చేయలేని పార్టీలూ ఉన్నాయి. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగే నాటికి మన దేశంలో అక్షరాస్యత చాలా తక్కువ. అందువల్ల వివిధ రాజకీయ పార్టీలకు ఎన్నికల చిహ్నాలు కేటాయించారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

కెనడాలో షూటౌట్: భారతీయ విద్యార్థిని మృతి

హామిల్టన్: కెనడాలో రెండు వర్గాల మధ్య షూటౌట్ జరిగింది. సినీఫక్కీలో రెండు కార్లలో వెళుతూ పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. దీంతో పనికి వెళ్లేందుకు బస్సు కోసం వేచివున్న సమయంలో అటుగా దూసుకొచ్చిన బుల్లెట్ తగలడంతో భారతీయ విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. హర్సిమ్రత్ రంధావా (21) ఓంటారియో, హమిల్టన్‌లోని మొహాక్ కాలేజి విద్యార్థిని. ఆమె బస్ స్టాప్‌లో ఉన్నప్పుడు అటుగా వెళ్లే కారులోని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో రంధావా మరణించారు. ఈ మేరకు హామిల్టన్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై టొరంటోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రంధావా కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. వారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపింది. రెండు వాహనాల్లో ఉన్న వారు పరస్పరం కాల్పులు జరుపుకునే క్రమంలో బుల్లెట్ తగిలి రంధావా ప్రాణాలు కోల్పోయారని, ఆమె అమాయకురాలని పోలీసులు వెల్లడించారని కాన్సులేట్ అధికారి వివరించారు. రంధావా కుటుంబానికి సమాచారం అందించామన్నారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 7.30 గంటలకు ఈ ఘటన హామిల్టన్‌లోని సౌత్ బెండ్ రోడ్ స్ట్రీట్స్-అప్పర్ జేమ్స్ వద్ద జరిగిందని తెలిపారు. ఛాతీ భాగంలో బుల్లెట్ తగలడంతో ఆమెను పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయిందని అధికారి చెప్పారు.

శ్రీలంకలో 'ఈస్టర్' అలర్ట్

చర్చిలో కాల్పులు: ఒకరికి గాయాలు-దుండగుడి అరెస్టు

కొలంబో: ఈస్టర్ సండే సందర్భంగా శ్రీలంకలో హై అలర్ట్ జారీ అయింది. 2019లో జరిగిన దాడి నేపథ్యంలో దేశంలోని అన్ని చర్చీల వద్ద సాయుధ పోలీసులు, బలగాలను పెద్దఎత్తున మోహరించారు. ఈస్టర్ సండే రోజున బాంబు దాడిలో వందల మంది చనిపోయి ఆరేళ్లు అవుతుంది. ఇలాంటి సమయంలో ఓ దుండగుడు రెచ్చిపోయి ఓ చర్చి వద్ద కాల్పులు జరపడం కలకలం రేపింది. రాజధాని కొలంబోకు 160 కిమీల దూరంలోని మనంపితియాలోగల చర్చి వద్ద ఈ ఘటన జరిగింది. కాల్పుల్లో ఒకరికి గాయాలు కాగా చర్చి కిటీకి అద్దాలు పగిలిపోయాయి. దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాస్టర్‌తో వ్యక్తిగత శత్రుత్వంలో చర్చిపై దాడికి దుండగుడు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు వెల్లడించారు.

కాంగో నౌకలో మంటలు: 150 మంది మృతి

కాంగో: కాంగో నదిలో ఘోర ప్రమాదం సంభవించింది. 500 మందితో ప్రయాణించే నౌకలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. అగ్ని ప్రమాదం జరగడంతో 150 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మంది ఆచూకీ లేరు. ఈ మేరకు అధికారులు తెలిపారు. మంటల నుంచి తప్పించుకోవడం కోసం మహిళలు, పిల్లలు నదిలోకి దూకి... ఈత తెలియక జల సమాధి అయ్యారన్నారు. రెడ్ క్రాస్, సహకారంలో సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అనేక మంది అగ్నికి ఆహుతి కాగా, కొందరికి థర్డ్ డిగ్రీ గాయాలయ్యాయని, సాయం అందక వారి పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు. అనేక మంది తీవ్రంగా కాలిపోవడంతో మృతుల సంఖ్య పెరగవచ్చని సెనేటర్ జీన్ పాల్ బొకెట్సు బోఫిలి వెల్లడించారు. మంటాంకుము నుంచి బొలంబాకు వెళుతుండగా మార్గమధ్యలో ఈ నౌక ప్రమాదానికి గురైందన్నారు.

రోమ్‌లో అమెరికా-ఇరాన్ అణు చర్చలు

రోమ్: అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు కొనసాగుతున్నాయి. రోమ్‌లో శనివారం రెండు దేశాల ప్రతినిధులు తాజాగా చర్చలు జరిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ముగింపు పలుకుతూ అణు ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా సంప్రదింపులు జరుపుతున్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్, ట్రంప్ ప్రభుత్వం తరపు పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కోఫ్... ఒమన్ మధ్యవర్తుల ద్వారా పరోక్షంగా సంప్రదింపులు జరుపుతున్నారు. మస్కట్‌లో తొలి దఫా చర్చలు నిర్మాణాత్మకంగా సాగినట్లు రెండు దేశాలు ప్రకటించాయి. కాగా, 'అణ్వస్త్రాలను ఇరాన్ కలిగివుండటానికి వీల్లేదు. ఆ దేశం సుసంపన్నంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మీడియాకు తెలిపారు. ఈ చర్చలపై తటస్థ వైఖరితో ఉన్నట్లు ఇరాన్ అధినేత ఖమేనీ అన్నారు. అణు చర్చలపై తనకు పూర్తి సానుకూలత లేక విముఖత లేదన్నారు.

నేపాల్ బస్సు ప్రమాదంలో 25 మంది భారతీయులకు గాయాలు

ముగ్గురి పరిస్థితి విషమం

ఖాట్మండు/లక్నో: నేపాల్, ఫోఖారాలో జరిగిన బస్సు ప్రమాదంలో భారత్‌కు చెందిన 25 మంది పర్యాటకులకు గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు అక్కడి పోలీసులు శనివారం తెలిపారు. నేపాల్‌తో సరిహద్దు పంచుకునే ఉత్తరప్రదేశ్‌లోని డాంగ్ జిల్లాలోగల తులసీపూర్ ఆసుపత్రిలో 19 మందిని చేర్చినట్లు వెల్లడించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ముగ్గురికి నేపాల్ ఆసుపత్రిలో చికిత్స అందుతోందని చెప్పారు. బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. క్షతగాత్రుల్లో చాలా మంది లక్నో, సీతాపూర్, హర్దోయి, బారాబంకీ జిల్లాలకు చెందిన వారున్నారన్నారు. సమాచారం అందిన వెంటనే నేపాల్‌లోని గంధావా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రులకు తరలించారు. తులసీపూర్ సర్కిల్ అధికారి బ్రిజ్‌నందన్ రాయ్ ఈ ఘటనను ధ్రువీకరించారు. స్వల్ప గాయాలైన కొందరికి ప్రాథమిక చికిత్స అందించి డిశార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అఫ్ఘాన్‌లో భూకంపం

భారత్‌లో ప్రకంపనలు

కాబూల్/న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్-తజికిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో శనివారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదైంది. ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వచ్చాయి. నేషనల్ సెంటర్ ఫర్ సీయిస్మోలజీ (ఎన్‌సీఎస్) ప్రకారం మధ్యాహ్నం 12.17 గంటలకు భూమికి 86 కిమీల లోతులో భూకంపం సంభవించింది. అఫ్ఘాన్-తజికిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ భూకంపం ప్రభావంతో భారత్ రాజధాని ఢిల్లీ-ఎన్‌సీఆర్, కశ్మీర్ లోయ తదితర ప్రాంతాల్లో స్వల్పస్థాయి నుంచి మధ్యస్థాయి వరకు భూ ప్రకంపనలు నమోదయ్యాయి. దీంతో భయపడిన ప్రజలు తమ ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీసిన వీడియోలు వైరలయ్యాయి. శ్రీనగర్‌లోని కార్యాలయంలో కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లు ఊగిపోగా కొన్ని చోట్ల ఇళ్లలో సమాన్లు కింద పడ్డాయి. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. అఫ్ఘానిస్థాన్... హిందూ కుష్ ప్రాంతంలో బుధవారం ఉదయం 5.9 తీవ్రతతో భూకంపం వచ్చినప్పుడు కూడా ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో భూమి కంపించినట్లు ఎన్‌సీఎస్ తెలిపింది.

70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటాం

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా రైతాంగాన్ని చైతన్యపరచాలని సూచించారు. ఈ నెల రెండో వారంనాటికి 8.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరగా ... 5.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇందులో సన్నరకాలు 3.79 లక్షల మెట్రిక్ టన్నులు, 1.98 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలని చెప్పారు. 2.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు చేరిందన్నారు. ఆదిలాబాద్ నుంచి మంత్రి సీతక్క హాజరయ్యారు.

7,337 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా 8,329 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోగా ఇప్పటికే 7,337 కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఇవి పీఏసీఎస్, ఐకేపీ ఐ.కే.పి అధ్వర్యంలో నడుస్తున్నాయన్నారు. నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. మిగిలిన జిల్లాలో త్వరలో ప్రారంభిస్తామన్నారు. మొత్తం 17.5 కోట్ల గన్ని బ్యాగులు అవసరం ఉండగా 9.45 కోట్లు కొత్తవి, 8.05 కోట్లు పాతవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 9.23 కోట్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 66.65 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉండగా అందులో 25 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ చేసేందుకు అవకాశం ఉందని, మిగిలిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములతో పాటు ప్రైవేట్ గోదాములలో ధాన్యాన్ని నిలువ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. అనధికార రవాణా వ్యవస్థను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాలతో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఫిలిప్పీన్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఎగుమతి చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే 12,500 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేశామన్నారు.

'వసంత హోమ్స్' భారీ షెడ్డు కూల్చివేత

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నెర్ర

ఆర్ఎస్ 79లో 39 ఎకరాలు ఆక్రమించినట్టు నిర్ధారణ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. మియాపూర్‌లోని హఫీజ్‌పేట్ సర్వే నెంబరు 79లో ఉన్న 39 ఎకరాల భూమిలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఈ వివాదాస్పద స్థలంలో 'వసంత హోమ్స్' అనే ప్రైవేటు సంస్థ భారీ షెడ్ నిర్మించి నూతన కార్యాలయం ఏర్పాటు చేయడంతో మూడు నెలల క్రితం హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేపట్టిన హైడ్రా బృందం తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లుగా నిర్ధారించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్లతో శనివారం కార్యాలయాన్ని కూల్చివేశారు. స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌తోపాటు భారీ షెడ్‌లు తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. సర్వే నెంబర్ 79లో మొత్తం 39.2 ఎకరాల్లో సగానికిపైగా ఆక్రమణలు జరిగినట్లు హైడ్రా వెల్లడించింది. ఈ సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమి... నిషేధిత జాబితాగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని తెలిపింది. వసంత హోమ్స్ సంస్థ తప్పుడు పత్రాలతో ప్రభుత్వ వ్యవస్థను తప్పుదోవ పట్టించిందని, సర్వే నెంబరు 79/1 సృష్టించి ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని హైడ్రా పేర్కొంది. 39 ఎకరాల్లో 19 ఎకరాలు ఆక్రమించి ఇళ్లు నిర్మించి అమ్మేశారని, ఖాళీగా ఉన్న మరో 20 ఎకరాల్లో వసంత హౌస్ నిర్మాణాలు చేపట్టిందని తెలిపింది. తన ముగ్గురు అనుచరుల సాయంతో దాదాపు రూ.రెండువేల కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసి నాలుగు భాగాలుగా విభజించి పలు షెడ్లు, కార్యాలయాలు, గెస్ట్‌హౌస్‌లు నిర్మించినట్లు పేర్కొంది. 'సర్వే నెంబర్ 79లోని భూములపై సుప్రీం కోర్టులో చాలా ఏళ్లుగా కేసు నడుస్తోంది. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇచ్చారు. ప్రభుత్వ భూమిపై కోర్టులో కేసులుండగా నిర్మాణాలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశాం' అని హైడ్రా స్పష్టం చేసింది.

గగనతలంలో 'స్మైలీ ఫేస్'

(మొదటిపేజీ తరువాయి)

సూర్యోదయానికి ముందు అతికొద్ది సమయం మాత్రమే కనిపించనున్న ఈ దృశ్యాన్ని ప్రపంచంలో ఎక్కడినుంచైనా వీక్షించేందుకు అవకాశం ఉంది. తూర్పు దిశగా భూమి లేక సముద్రం... ఒక రేఖ వద్ద ఆకాశంతో కలుస్తున్నట్టుగా ఉన్నదగ్గర దీనిని గమనించవచ్చు. ఆ గీతకు ఎగువన శుక్రుడు, కిందివైపు శని... ఇంకా కిందికి నెలవంక ఒక దగ్గరకు రానున్నాయి. ఈ రెండు గ్రహాలు నయనాలుగా, నెలవంక చిరునవ్వుతో ఉన్న పెదాలుగా కనిపించనుంది. ఈ వివరాలను అమెరికా అంతరిక్ష సంస్థ నాసా సోలార్ సిస్టమ్ అంబాసిడర్ బ్రెండా కల్‌బర్ట్సన్ వెల్లడించారు. శుక్రుడు, శని ప్రకాశవంతంగా ఉండటంతో వాటిని మామూలుగా వీక్షించవచ్చు. అయితే స్మైల్ ఇమేజ్‌ను చూసేందుకు మాత్రం స్టార్‌గేజింగ్ బైనాక్యులర్, టెలిస్కోప్ అవసరం కానున్నాయి. ఆకాశంలో ఎలాంటి మేఘాలు లేకపోతే... అదే సమయంలో ఈ మూడింటి కింద బుధుడిని చూడొచ్చని మీడియా కథనం పేర్కొంది.

విశాఖ పీఠం కూటమిదే

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గ్రేటర్ విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై 'కూటమి' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలన్న సంకల్పంతో కూటమి నెల రోజులుగా క్యాంప్ రాజకీయాలు నిర్వహించింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. కూటమి ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు ప్రత్యేక బస్సుల్లో వచ్చి అవిశ్వాస తీర్మానంలో చేతులెత్తి ఓటేశారు. ఈ సమావేశానికి వైసీపీ సభ్యులు గైర్హాజరు కాగా, వామపక్ష సభ్యులు దూరంగా ఉన్నారు. అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని విశాఖ జిల్లా కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు 63 మంది హాజరయ్యారని, ఎక్స్ అఫీషియో సభ్యులయిన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు 11 మందితో కలిపి మొత్తం 74 మంది సభ్యులు హాజరయ్యారని చెప్పారు. కోరం సరిపోయినందున అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టామని, 74 మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతు తెలిపారని ఆయన వివరించారు. ఎవరూ ప్రతిపాదనకు వ్యతిరేకంగానీ, తటస్థంగా గానీ లేరని చెప్పారు. అవిశ్వాస తీర్మానంపై వచ్చిన మద్దతును అంగీకరించి తీర్మానాన్ని ఆమోదించడం జరిగిందని, తదుపరి చర్య కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు.

మిథున్‌కి ముచ్చెమటలు

ఏపీ సిట్ 8 గంటల సుదీర్ఘ విచారణ

సమాధానాలు చెప్పలేక తడబాటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వహయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ విచారణ వేగవంతం చేసింది. ఈ కేసులో కీలక నిందితుడిగా భావిస్తున్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు విచారించారు. శనివారం ఉదయం విజయవాడ సిట్ కార్యాలయానికి చేరుకున్న మిథున్‌రెడ్డిని దాదాపు 8 గంటల పాటు సిట్ ఇబ్బడి ముబ్బడి ప్రశ్నలతో ముచ్చెమటలు పట్టించింది. అనేక ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పలేక తడబాటుకు గురైనట్లు తెలిసింది. వివిధ అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించి మిథున్‌రెడ్డి నుంచి అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. కోర్టు ఉత్తర్వుల మేరకు న్యాయవాది సమక్షంలోనే ఈ విచారణ సాగింది. మద్యం పాలసీ రూపకల్పనలో మిథున్‌రెడ్డి ప్రమేయం, డిస్టిలరీ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం కొనుగోళ్లపై సుదీర్ఘంగా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. రాజ్ కసిరెడ్డికి చెందిన అదాన్ డిస్టిలరీ, డికార్ట్ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎంతమేర కొనుగోళ్లు చేసిందని ప్రశ్నించినట్లు తెలిసింది. రాజ్ కసిరెడ్డి, ఆయన అనుచరులు చాణక్య రాజ్, అవినాశ్‌రెడ్డితో మిథున్‌రెడ్డికి ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీల గురించి సిట్ అధికారులు ఎక్కువగా ప్రశ్నలు సంధించారు. చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు సూటిగా చెప్పకుండా దాటవేసినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో భారీగా అనుచిత లబ్ధి పొందిన కంపెనీల్లో ఒకటైన అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ వెనక రాజ్ కసిరెడ్డితో పాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఉన్నారని వైసీపీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి సిట్ విచారణ సందర్భంగా శుక్రవారం బయటపెట్టిన విషయం తెలిసిందే.

'వ్యాపారం చేసుకుంటాం, మీ అరబిందో కంపెనీ నుంచి రూ.100 కోట్లు అప్పు ఇప్పించండని మిథున్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి నన్ను అడిగారు' అని విజయసాయిరెడ్డి తెలిపారు. దానిపై తాను అరబిందో శరత్‌చంద్రారెడ్డికి సిఫారసు చేసి... అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.60 కోట్లు, డీకార్ట్‌కు రూ.40 కోట్లు రుణం ఇప్పించానని వెల్లడించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నూతన మద్యం విధానానికి సంబంధించిన తొలి రెండు సమావేశాలు హైదరాబాద్, తాడేపల్లిలోని తన నివాసాల్లోనే జరిగాయని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ ప్రస్తావిస్తూ సిట్ అధికారులు మిథున్‌రెడ్డి నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయత్నించారు. చివరిగా మిథున్‌రెడ్డి వాగ్మూలంపై సిట్ అధికారులు సంతకాలు తీసుకున్న తర్వాత మళ్లీ అవసరమైతే పిలుస్తామని చెప్పి పంపించారు.

రాజకీయ వేధింపుల్లో భాగమే: మిథున్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని మిథున్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటి వరకు తమ కుటుంబంపై ఎన్ని కేసులు పెట్టినా... ఏ ఒక్కటీ నిరూపించలేకపోయిందని ఆయన విమర్శించారు. మద్యం కేసు కూడా రాజకీయ వేధింపుల్లో భాగమేనన్నారు. సిట్ విచారణ అనంతరం బయటకు వచ్చిన మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ కోర్టులో ఉన్నందున, ఈ వ్యవహారంలో ఇప్పుడేమీ మాట్లాడలేనని చెప్పారు.

రైతు భద్రతకే 'భూభారతి'

(మొదటిపేజీ తరువాయి)

నిర్మిస్తామని తెలిపారు.భూభారతి చట్టం వల్ల ప్రతి రైతుకు భద్రత కలుగుతుందని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం ఇస్తున్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేసిందని అన్నారు. కలెక్టర్లు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హన్మంతు, ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ భూపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విప్ ధిక్కరిస్తే ...బహిష్కరణే

(మొదటిపేజీ తరువాయి)

ఇరు పార్టీలకు సమదూరం పాటించాలని కేటీఆర్ ఆదేశించారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్లకు త్వరలో ఉప ఎన్నికలు ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ ఇరవై ఐదేళ్ల పండుగ తెలంగాణ ప్రజల ఇంటి పండుగ అని తెలిపారు. ఎన్టీఆర్ - టీడీపీ తర్వాత ఇరవై ఐదేళ్ల పాటు పార్టీని నడిపింది కేసీఆర్ మాత్రమేనని ఉద్ఘాటించారు. కులబలం, ధనబలం లేకుండా కేసీఆర్ పార్టీని స్థాపించారని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ బయట కాంగ్రెస్ చేతిలో ప్రజలు మోసపోయారని అన్నారు. రేవంత్ రెడ్డి తన అన్న ఇల్లును ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చారని ధ్వజమెత్తారు. 17నెలల్లో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందని చెప్పారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుదేలయిందని అన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ ఛార్జ్ షీట్ పెడితే రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం రేవంత్ రెడ్డిలది దృఢమైన బంధమని ఆరోపించారు. హైదరాబాద్‌లో హైడ్రా, మూసీ,సెంట్రల్ యూనివర్సిటీ భూముల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి అరాచకాలు చేశారని కేటీఆర్ ఆరోపించారు. సందట్లో సడేమియాలా బీజేపీ నేతలు అధికారం కోసం ఆశపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ గెలుపు ఖాయమని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

విజయసాయిరెడ్డి చరిత్ర బైటపెడతా

ఆడియో ద్వారా హెచ్చరించిన రాజ్ కసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కొన్నాళ్లుగా తనపై అసత్య ప్రచారం జరుగుతోందని, దీనిపై తన న్యాయపోరాటం పూర్తయిన తర్వాత అన్ని వివరాలు వెల్లడిస్తానని రాజ్ కసిరెడ్డి (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి) శనివారం విడుదల చేసిన ఆడియోలో వెల్లడించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపై చేసిన ఆరోపణలపై త్వరలోనే మీడియా ముందుకు వచ్చి వివరాలు వెల్లడిస్తానని, ఆయన చరిత్ర బయట పెడతానని హెచ్చరించారు. మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా శుక్రవారం సిట్ విచారణకు హాజరైన విజయసాయిరెడ్డి కీలక ఆధారాలు బైటపెట్టారు. వీటిలో భాగంగా రాజ్ కసిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. అతను చాలా తెలివైన క్రిమినల్ అని, అతనికి అంత క్రిమినల్ బ్రెయిన్ ఉందని తెలియక ప్రోత్సహించానని తెలిపారు. 2017-18 మధ్య పార్టీలోని కొందరు వ్యక్తులు అతణ్ని తనకు పరిచయం చేశారని, తొలుత వైసీపీ ఎన్ఆర్ఐ విభాగం బాధ్యతలిచ్చానన్నారు. తర్వాత సోషల్ మీడియా చూసుకోమని చెప్పానని, ప్రశాంత్ కిశోర్ ప్రొటోకాల్ తదితర అత్యంత ముఖ్యమైన బాధ్యతలు అప్పగించానని విజయసాయి వివరించారు. అతని విషయంలో తప్పు చేశాననే భావన ఇప్పుడు కలుగుతోందన్నారు. అతను దుర్మార్గమైన వ్యక్తి అని, పార్టీని, ప్రజల్ని మోసం చేశాడని విజయసాయిరెడ్డి చెప్పారు.

రాజ్ కసిరెడ్డికి అంతటి అధికారం ఎవరిచ్చారని సిట్ ప్రశ్నించగా తనకు తెలియదని జవాబిచ్చినట్లు చెప్పారు. దీనిపై ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న రాజ్ కసిరెడ్డి ఓ ఆడియో విడుదల చేశారు. తాను లేనప్పుడు సిట్ అధికారులు ఆఫీసుకు, ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారన్నారు. మద్యం కుంభకోణం వ్యవహారంపై సిట్ రెండుసార్లు నోటీసులు ఇచ్చింది. దీనిపై న్యాయస్థానానికి వెళ్లాను. నిర్దిష్ట సమయం ఇచ్చి నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. న్యాయరక్షణ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాను. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నాను. మద్యం కుంభకోణంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తనపై విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పుడు ఏమీ మాట్లాడనంటూనే తన న్యాయపోరాటం పూర్తయిన తర్వాత మీడియాను పిలిచి ఆయన చరిత్ర బయటపెడతానని హెచ్చరించారు.

వక్ఫ్ చట్టాన్ని తిప్పికొడదాం

(మొదటిపేజీ తరువాయి)

భూముల అన్యాక్రాంతానికి నాంది పలికారన్నారు. సుప్రీంకోర్టులో న్యాయం జరిగినా జరగకపోయినా, వక్ఫ్ సవరణ చట్ట వ్యతిరేక ఉద్యమానికి సీపీఐ నాయకత్వం వహించాలని కోరారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఎన్.శ్రీకాంత్, షంషుద్దీన్, ఎండి.సలీం, సలీమ్ ఖాన్, కాంపల్లి శ్రీనివాస్, గ్యార నరేష్, మహమూద్ పాల్గొన్నారు.

ఇప్పుడు మీ ముందు ఇలా...: అమిత్ షా

న్యూఢిల్లీ : దేశ యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సూచించారు. దానివల్ల మరో 40 నుంచి 50 ఏళ్లు జీవించి, దేశ వృద్ధికి దోహదం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బరువు తగ్గేందుకు తాను పాటిస్తోన్న జీవనశైలిని మంత్రి వెల్లడించారు. 'తగిన నిద్రపోవాలి. నీరు, శరీరానికి సరిపడే పౌష్టికాహారం తీసుకోవాలి. ఇక రోజూ చేసే వ్యాయామం నాకెంతో ఉపయోగపడింది. అందుకే నేను ఇప్పుడు మీ ముందు ఇలా నిల్చున్నాను. నేను ఎలాంటి అల్లోపతి మందులు, ఇన్సులిన్ తీసుకోవడం లేదు. 2020 నుంచి కొనసాగుతోన్న ఈ తరహా బరువు తగ్గే ప్రయాణంలో... నిద్ర, వ్యాయామం అత్యంత కీలకం. వాటిని అంతా సీరియస్‌గా తీసుకోవాలి' అని హోం మంత్రి వివరించారు.

అమృత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : హాలియా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అమృత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆమె నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డితో కలిసి హాలియా మున్సిపల్ కార్యాలయంలో అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి పనులపై ఇంజనీరింగ్ అధికారులు, కాంటాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే హాలియా మున్సిపాలిటీలో చేపట్టిన అమృత్ పనుల పురోగతి ఆశించినంతగా లేదని, అందువల్ల కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆమె ఆదేశించారు. కాగా హాలియా మున్సిపాలిటీలో 15.20 కోట్ల రూపాయలతో చేపట్టిన తాగునీటి పనులు వివిధ స్థాయిలలో పెండింగ్లో ఉండగా, వీటిపనులు వెంటనే చేపట్టి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యం చేసినందుకు గాను అమృత్ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ అమృత్ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉందన్నారు.ఒప్పందం ప్రకారం పనులు పూర్తి చేయనందుకు గాను కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. కాగా అమృత్ పథకం కింద హాలియ మున్సిపల్ పరిధిలో పెద్దగడిలో 200 కిలో లీటర్లు, అనుముల లో 500 కె ఎల్,హై స్కూల్ వద్ద 900 కె ఎల్ ,ఇబ్రహీం పెట్ వద్ద 300 కె ఎల్ సామర్థ్యం కలిగిన ఈ ఎల్ ఎస్ ఆర్ (తాగు నీటి ట్యాంకు ల) పనులను 15.20 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగింది. పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ, డిఈ మనోహర, ఏఈ సురేష్, హాలియ మున్సిపల్ కమీషనర్ రామ్ దుర్గా రెడ్డి, సబ్ కాంట్రాక్టర్ సతీష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెట్టేస్తున్న బీజేపీ

విశాలాంధ్ర - ఖమ్మం : మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని వివాదాస్పద చట్టాలు తీసుకొస్తూ దేశ లౌకిక వ్యవస్థకు భంగం కలిగిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగంహేమంత రావు పిలుపునిచ్చారు. ఖమ్మం శనివారం నగరంలోని 44వ డివిజన్ లెనిన్ నగర్ మహాసభలకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విభిన్నమతాలు, జాతులు, భిన్న సంస్కృతులు కలిగిన భారతదేశ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే విధంగా కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద చట్టాలను తీసుకొస్తుందని దీనిలో భాగంగానే 370 ఆర్టికల్ రద్దు,త్రిభుల్ తలాక్,వోక్ఫ్ చట్టం లాంటి వివాదాస్పద చట్టాలు తీసుకొచ్చిందన్నారు.వీటి వల్ల ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి మైనారిటీలైన ముస్లిం ప్రజలలో భయాందోళనలు కలిగిస్తూ మతోన్మాద భావాలను రెచ్చగొట్టడం ద్వారా మతపరమైన రాజకీయ ప్రయోజనలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం ప్రజల సమస్యలను విస్మరించి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ అశాంతి సృష్టిస్తుందని దిని వలన మన దేశ లౌకిక వ్యవస్థకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇటీవల తీసుకొచ్చిన వోక్ఫ్ బోర్డ్ సవరణ చట్టం మైనారిటీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. దేశాన్నీ ప్రమాదపు అంచుల్లో నెట్టివేస్తున్న మతోన్మాద కార్పొరేట్ అనుకూల బీజేపీ ప్రభుత్వనికి వ్యతిరేకంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు నిర్వహించాలని భాగం పిలుపునిచ్చారు. ఎస్కే చానా అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నగర కార్యదర్శి ఎస్కే జానీమియా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఏనాల సాంబశివారెడ్డి, బోడ వీరన్న, తాటి నిర్మల, నాయకులు దుంగ్రోత్ శేఖర్, మసీద్దీన్, ఎస్.కె చాన, భద్రం పాల్గొన్నారు.

భూభారతి చట్టంపై రైతులు అవగాహన కల్గి ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - ములుగు జిల్లా : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో, గోవిందరావు పేట మండలం కేంద్రంలోని రైతు వైదికలో వేర్వేరుగా నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుండి అభ్యంతరాలను తెలుసుకున్న అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా వివరించారు.భూ భారతి పై పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. ఈ సదస్సులలో జిల్లా పంచాయతీ అధికారి దేవ్‌రాజ్, తహసీల్దార్లు విజయభాస్కర్, సృజన్ కుమార్, ఎం పి డి ఓ లు రామక్రిష్ణ, జవహర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన తండాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర- మరిపెడ: గిరిజన తండాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు శనివారం మరిపెడ మండలం లూనావత్ తండ గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరు అయిన రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. అందులోని భాగంగానే ఉచిత బస్ ప్రయాణం. సన్న బియ్యం, సబ్సిడీ గ్యాస్, రైతు బంధు, రూ.500 బోనస్, రైతు రుణ మాఫీ, సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇలా అనేక పథకాలు చేపట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. పల్లెలే దేశానికి పటుకొమ్మలని, పల్లెలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు ప్రల్లె ప్రయోజనాలకు ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రవినాయక్, గండి వీరభద్రం, తండ నాయకులు లూనావత్ వెంకన్న, బానోతు బిల్లు, బానోతు రెడ్డి, లూనావత్ శంకర్, లూనావత్ భద్రు, బొడ్డు వెంకన్న. లూనావత్ మంచా, పంతులు, బానోతు భగ్న, రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు చేస్తున్నాం

కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర - కొత్తగూడెం : రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా యాసంగి 2024-25 సీజన్ ధాన్యం కొనుగోలు చేస్తున్న క్రమంలో కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సచివాలయం నుంచి శాఖా కమిషనర్ డి.ఎస్. చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో యాసంగి వడ్ల కొనుగోలు, సన్న బియ్యం పంపిణీ, త్రాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, నిల్వలను పరిశీలించాలని మంత్రి కోరగా స్పందించిన కలెక్టర్ జితేష్ జిల్లాలో చేస్తున్న ఏర్పాట్ల గురించి వివరించారు. జిల్లా ఐడిఓసి కార్యాలయం నుండి కలెక్టర్, అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి హాజరై మాట్లాడారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నల్లా కనెక్షన్ లేని ప్రాంతాలకు వాటర్ ట్యాంకులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ అధికారి బాబురావు, నీటి పారుదల శాఖ ఈఈ అర్జున్‌రావు, మిషన్ భగీరథ ఈఈ లు తిరుమలేష్, నలిని, పౌరసరఫరాల శాఖ అధికారులు త్రినాథ్‌బాబు, రుక్మిణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మేడే వేడుకలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : మేడే వేడుకలు విజయ వంతం చేయాలని ఐ ఎన్ టి యు సి నియోజకవర్గ అధ్య క్షుడు బెల్లంకొండ గురువయ్య కోరారు. శనివారం నేరేడుచర్ల పట్టణంలో అడ్డ కూలిల సెంటర్ నందు ఐ ఎన్ టి యు సి అనుబంధ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు నన్నేపంగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం జరుపుకునే పండుగ మేడే అని అన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాడిన మహనీయులను స్మరించే రోజునే మేడే అని అన్నారు. నేరేడుచర్ల పట్టణంలో వచ్చే మేడేనీ ఐ ఎన్ టి యు సి అనుబంధ యూనియన్లు అన్ని పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సలహాదారులు ఇంజమూరి మల్లయ్య కోశాధికారి సందీప్ జనరల్ సెక్రటరీ కుర్రి వెంకన్న అమరారాపు శ్రీరాములు మహేష్ వెంకటేష్ వేణు జ్ఞానేష్ బాబు ఇతరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పంట కొనుగోలుకు చర్యలు : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - ములుగుజిల్లా : ప్రణాళికా బద్ధంగా యాసంగి పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సన్న బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావులతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్ డబ్లు ఎస్ ఎస్ ఈ మల్లేశం, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి అప్పలనాయుడు, ఈ ఈ నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి దేవ్ రాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా ఫైజల్ హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి భూభారతి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : నూతన భూభారతి చట్టాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. పుల్కల్ మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక భూభారతి 2025 చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిం చారు. భూభారతిపై రెవెన్యూ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున నూతన భూ చట్టానికి శ్రీకారం చుట్టిందన్నారు. భూభారతి చట్టాన్ని ఇతర రాష్ట్రాల, రెవెన్యూ చట్టాలను పరిశీలించి దాదాపు రెండు సంవత్సరాలుగా చాలామంది మేధావులు, రైతులు, రైతు సంఘాల నాయకులను సంప్రదించిన అనంతరం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టారన్నారు. భూభారతిలో చాలా సులభతరంగా రైతు సమస్యల్ని పరిష్కరించవచ్చున్నారు. రైతులకు భూభారతి చట్టంపై ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. అనంతరం పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగదిని, స్టోర్ రూమ్ పరిశీలించారు. మెనూ అమలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ మాధురి, రైతు సంఘం నాయకులు, రైతులు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఆసుపత్రి సిఎంఓ ను కలిసిన ఎడ్యుకేషన్ అధికారులు

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఇటీవలే కొత్తగూడెం లోని సింగరేణి ప్రధానాస్పత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిరణ్ కుమార్‌ను ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ జి. శ్రీనివాస్ జాయింట్ సెక్రెటరీ కె. సునీల్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పూల మొక్క అందించి అభినందనలు తెలిపారు. హెల్త్ క్యాలెండర్ కార్యక్రమంలో సి ఎం ఓ సింగరేణి పాఠశాలలు, కళాశాలలను పొందు పరచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సిఎంఓగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే కిరణ్ కుమార్ తమ విద్య సంస్థల్లోని విద్యార్థుల పట్ల విశాల దృక్పదంతొ శ్రద్ధాను కనబరిచారని జి. శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. వైద్య సదుపాయాలు పొందడంలో పాఠశాలలు, కళాశాలల కాంట్రాక్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి సిఎంఓ కు వివరించారు. దింతో స్పందించిన సీఎంఓ విద్యా సంఘానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

సన్న బియ్యం పంపిణీతో ప్రజల్లో సంతోషం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: లబ్ధిదారులకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీతో ప్రజలు చాలా సంతోషపడుతున్నారని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం వారు రామగుండం నగరం 46వ డివిజన్ అడ్డగుంటపల్లి ఎస్సీ కాలనీలో సన్నబియ్యం లబ్ధిదారు అమృత నివాసంలో భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇక నుంచి రేషన్‌లో సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ సంతోష సమయంలో లబ్ధిదారుల తో కలిసి భోజనం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం తాసిల్దార్ శ్రీపాద ఈశ్వర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రేస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : సింగరేణిలో రెగ్యులర్ కార్మికులతో సమానంగా శ్రమిస్తున్న కాంట్రాక్టు కార్మికులను చట్టం ప్రకారం వేతనాలు పెంచాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు) రాష్ట్ర నేత ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని ఇఫ్టు కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు కే. సారంగపాణి అధ్యక్షతన జరిగింది. ఆదివారం జరగబోయే సింగరేణి డైరెక్టర్ల సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై చర్చించాలని కృష్ణ డిమాండ్ చేసారు. వారి కోల్ ఇండియాలో ఉన్న వేతనాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తూ గొడ్డు చాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ మేనేజ్మెంట్ రూ.1000 కోట్ల లాభంలో ఉందని చెబుతున్న యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచడం లేదని ప్రశ్నించారు. కాంటాక్ట్ కార్మికులకు జాతీయ సెలవు దినాలు, ఓటు హక్కు, క్వార్టర్లు, వేతనాలను ఆదివారం జరిగే డైరెక్టర్‌ల సమావేశంలో చర్చించి పరిష్కరించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ భావజాల బిజెపి సర్కార్ తెచ్చే లేబర్ కోడ్ ల రద్దు కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని డిమాండ్ కార్మిక వర్గం 139వ మేడే జరపాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, ఎండి. రాశుద్దిన్, ఎస్. సంజీవ్, మల్లికార్జునరావు, ఉపేందర్రావు, సురేష్, మారుతిరావు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సింగరేణి కళాశాలలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం లోని సింగరేణి కాలరీస్ మహిళా కళాశాల ఆధ్వర్యంలో బాలికలకు, మహిళలకు ఈ వేసవి లో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ జి. శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కొత్తగూడెం మహిళా కాలేజీలో జరిగే ఈ తరగతుల్లో బాలికలకు, మహిళలకు, గృహిణులకు మాత్రమే ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు సుమారుగా 45 రోజుల పాటు వుంటాయన్నారు. ఇందులో ఇంగ్లీష్ గ్రామర్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీషులో ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. ఆంగ్ల భాషలో డాక్టరేట్ చేసిన వారిచే ఈ శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ తరగతులకు కన్వీనర్ గా డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఎండి.నస్రీన్ బేగం వ్యవహరిస్తారని శ్రీనివాస్ చెప్పారు. మరిన్ని వివరాల కోసం ఈ 8332048249 - 9502883686 ఈ క్రింది నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

మహిళల సంక్షేమానికి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

విశాలాంధ్ర - కారేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాన్ని ఎంత ఖర్చైనా భరిస్తూ నడిపిస్తుందని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో ఇల్లందు నుండి వయా కమలాపురం-ఖమ్మం టిజిఎస్ ఆర్టిసి బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే జండా ఊపి ప్రారంభించారు. కోటమైసమ్మ తల్లి దేవాలయానికి వచ్చిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు దేవస్థాన చైర్మన్ డాక్టర్ పరస పట్టాభి రామారావు, ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాస శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరికాయలపల్లి నుండి సుర్యతండా వరకు ఎమ్మెల్యే రాందాస్ బస్సులో ప్రయాణం చేశారు.

అబద్ధాలతో విషం చిమ్ముతున్న బీజేపీ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : స్వాతంత్ర పోరాటంలో తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులను కూడా వదలకుండా బిజెపి పార్టీ నాయకులు, కేంద్ర ప్రభుత్వం అబద్ధాలతో విషం చిమ్ముతున్నట్లు టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ఆరోపించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం సన్నాహక మండల సమావేశం సుజాత నగర్‌లొ శనివారం మండల అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది.ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారాములు మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. అహింసా మార్గంలో స్వాతంత్రం తెచ్చిన మహాత్మగాంధీ, రాజ్యాంగం ద్వారా ఎన్నో హక్కులు కల్పించిన బిఆర్ అంబేద్కర్ లపై బీజేపీ అంతర్గత ఎజెండాలను, విష ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆ



మహానుభావుల పేర్లను ప్రజల మనసుల నుండి చేరిపెయ్యాలనే ఆర్ ఎస్ ఎస్, బీజేపీ కుతంత్రాలను తిప్పికొట్టెందుకే కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన మండల కో-ఆర్డినేటర్ చింతిర్యాల రవి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెబి శౌరి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, సీనియర్ నాయకులు ఆళ్ళ మురళి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రామలక్ష్మణ్ రావు, అజ్మీరా సురేష్ నాయక్, రాంబాబు, భాగం మోహన్ రావు, కసనబోయిన భద్రం, కరీం పాషా, షేక్ అబీద్, నాగార్జున, శ్రీకాంత్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషికి డాక్టరేట్ పురస్కారం

ఎమ్మెల్యే కూనంనేని చేతుల మీదుగా సత్కారం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : నిరంతరం ప్రజాసేవలో అంకితమై కుల మతాలకతీతంగా బాధితులను ఆదుకుంటూ సామజిక సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉర్దుఘర్ అధ్యక్షులు, రాష్ట్ర మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషికి డాక్టరెట్ పురస్కారం దక్కింది. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఖురేషికి సౌమ్యుడిగా, అందరి వాడిగా మంచి గుర్తింపు వుంది. కాగా గత 15 ఏళ్లగా చేసిన అనేక సామాజిక సేవలను గుర్తించి ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ఖురేషికి డాక్టరేట్ పురస్కారం ప్రధానం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా డాక్టరేట్ పురస్కారం అందించి అతన్ని సత్కరించారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ నయీమ్ ఖురేషి తండ్రి స్వర్గీయ రహీమ్ ఖురేషి కూడా ఉమ్మడి జిల్లాలో అనేక సామజిక సేవకార్యక్రమాలు కుల మతాలకతీతంగా చేసే వారని గుర్తు చేసారు. తండ్రికి తగ్గ తనయుడిగా పరిశ్రమికవేత్త నయీమ్ ఖురేషి కూడా అదే వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. నయీమ్ ఖురేషి మాట్లాడుతూ తనకు యూనివర్సిటీ ప్రకటించి డాక్టరేట్ పురస్కారాన్ని తాను ఎంతగానో అభిమానించే ప్రియతమ ప్రజా నాయకులు, ఎమ్మెల్యే కూనంనేని చేతుల మీదుగా అందుకోవాలన్న కోరిక నెరవేరిందన్నారు. యూనివర్సిటీ బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, స్థానిక పెద్దలు అబ్దుల్ రబ్, జమాత్ ఇస్లామే హిందీ జిల్లా అధ్యక్షులు ఉమర్ యాజ్దని, పట్టణ అధ్యక్షులు జహంగీర్ షరీఫ్, ఉర్దూ ఘర్ కార్యదర్శి ఎండీ షరీఫ్, అంజుమన్ అధ్యక్షులు అమీర్ ఖాద్రి, కాంగ్రెస్ మైనారిటీ కార్యదర్శి ఎండీ ఖమర్, నాయకులు ఎండీ మొయిన్, బాబుజని ఖాన్, ఎండీ. జమాల్, ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెదురు సాగుపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లాలో వెదురు సాగుపై రైతులకు అవగాహన కల్పించి తమ చేలల్లో సాగు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ ఫార్మా డైరెక్టర్ రజిత కోరారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలోఆమె అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లాలోని ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సీఈవోలు, జిల్లా సమాఖ్య సభ్యులు, ఏపీఎంతొ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జరిగిన మిర్చి కొనుగోలు వివరాలను డైరెక్టర్ రజిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ పీసీల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. ఒక కోటి టర్నోవర్ చేశారని ఇంకా టర్నోవర్ పెంచాలని అధికారులకు ఆమె సూచించారు. గుండాల, ములకలపల్లి, చంద్రుగొండ, మండలాల్లో వెదురు రైతులకు గుర్తింపు, ఆన్లైన్ నందు డేటా ఎంట్రీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రైతులకు వెదురు సాగు వల్ల కలిగే లాభాలు గురించి అవగాహన కల్పించాలన్నారు. సమీకృత వ్యవసాయం గురించి ఆమె రైతులకు సూచనలు ఇచ్చి, నాచురల్ ఫార్మింగ్ సీఆర్పీల పనితీరుపై చర్చించారు. మునగ సాగు, మునగాకుల సేకరణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎఫ్ పి సి కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఫార్మ టిపిఎం వెంకయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎండి గౌస్ వర్ధంతి

విశాలాంధ్ర - గూడూరు : అనారోగ్యం కారణంగా నాలుగు సంవత్సరాల క్రితం మరణించిన ఎండి గౌస్ చిత్రపటానికి సిపిఐ (యు) పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం ఎం సి పి ఐ (యు) మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో ఉన్నత చదువుల కోసం కామ్రేడ్ గౌస్ చిన్నప్పటి నుండి చదువు మీద శ్రద్ధతో ఉన్నత శిఖరాలను అధిరోహించి చిన్ననాటి నుండి కమ్యూనిస్టు భావజాలం కలిగి సీపీఎం పార్టీలో చేరి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ నాయకత్వంలో ఎం సిపిఐ పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి దేశవ్యాప్తంగా లాల్ నీల్ జెండాలను ఏకం చేయాలన్న తపనతో అలుపెరుగని పోరాటాలు చేసి వరంగల్ జిల్లాలో 1984లో నిర్బంధ దాడుల కేసులను ఎదుర్కొని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి ప్రాణ త్యాగం చేసిన మహోన్నత నాయకుడు ఎండి గౌస్ అని నూకల ఉపేందర్ కొనియాడారు. కటకం బుచ్చిరామయ్య, బండారి సత్యం, నవీన్ వెంకన్న తదితరులు ఉన్నారు.

వక్ఫ్‌సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర- పినపాక: వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే కుట్రలొ భాగంగానే వక్ఫ్ సవరణ 2025 బిల్లు పేరుతొ నాటకాలాడుతుందని పలువురు ముస్లిం మత పెద్దలు ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసనతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం పినపాక కార్యాలయంలో తహసిల్దార్ అద్దంకి నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ ప్రతి మతానికి సమానమైన హక్కులు, ప్రాతినిధ్యాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. మోదీ ప్రధానిగా అధికారం చెప్పట్టాక ముస్లింలను టార్గెట్ చేస్తూ వక్ఫ్ ఇలాంటి నల్లచెట్టాలను తెచ్చి ఇబ్బందులు పెడుతున్నట్లు విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా ముస్లిం వర్గాల కోసం ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డును బిజెపి కేంద్ర ప్రభుత్వం సవరణ పేరుతొ తమ అనుకూల కార్పొరేట్ బడా బాబులకు కట్టబెట్టేందుకు రాజ్యాంగ విరుద్ధంగా కుట్రలకు తెరలేపినట్లు ఆరోపించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్పందించకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు ఎండి సలీం, ఎస్కే మీరా సాహెబ్, ఎస్కే లాల్ మొహమ్మద్, ఎస్.కె. యాకూబ్ పాషా, యువకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఇక జైనుల వంతు

బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ విలే పార్లే ప్రాంతంలో ఓ జైన మందిరాన్ని గత 16వ తేదీన కూల్చేసింది. ఈ మందిరాన్ని అక్రమంగా నిర్మించారంటున్నారు. ఈ మందిరాన్ని కూల్చేయాల్సిన అవసరమే లేదని జైనులు వాదిస్తున్నారు. ముంబైలో వేల సంఖ్యలో జైనులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేస్తున్నారు. నిజానికి బృహన్ముంబైకి ఎప్పుడో ఎన్నికలు జరగాల్సింది. కొత్త నాయకత్వం అధికారంలోకి రాకపోయినా బృహన్ముంబై అధికారులు జైన మందిరాన్ని కూల్చేయడం వింతగా ఉంది. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉంది. కేంద్రంలోనూ మోదీ నాయకత్వంలో బీజేపీయే అధికారంలో ఉంది. అంటే అక్కడ డబుల్ ఇంజన్ సర్కారు ఉంది. అలాంటప్పుడు జైన మందిరాన్ని పనిగట్టుకుని కూల్చేయడం అంటే ముస్లింల తరవాత బీజేపీ జైనుల మీద గురి పెట్టిదనుకోవాలి. కాంబ్లీవాడీలో నేమీనాథ్ సహకార గృహ నిర్మాణ సంఘ ఆవరణలో ఉన్న జైన మందిరాన్ని కూల్చేయడం మీద విపరీతమైన వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈ జైన మందిరం 1960 నుంచి ఉంది. ఇంతకు ముందు బృహన్ముంబై అనుమతితోనే ఈ మందిరానికి మరమ్మతులు కూడా చేశారు. అప్పుడు ఈ మందిరం అనుమతులు లేకుండా నిర్మించిందని ఇన్నాళ్లు ఫడ్నవిస్ నాయకత్వంలోని బీజేపీ సర్కారుకు ఎందుకు తట్టలేదో అంతు పట్టదు. ఇలాంటి నిర్మాణాలను క్రమబద్ధీ కరించాలని ప్రభుత్వం ఓ తీర్మానం కూడా ఆమోదించింది. ఇందుకోసం ఈ మందిర ధర్మకర్త బృహన్ముంబైకి దరఖాస్తు కూడా చేసుకున్నారు. అప్పుడైనా మహారాష్ట్ర ప్రభుత్వానికి గానీ బృహన్ముంబై అధికారులకు గానీ ఈ మందిరాన్ని అక్రమంగా నిర్మించారన్న స్పృహ ఎందుకు కలగలేదో! ఈ పార్శ్వనాథ జైన మందిరాన్ని కూల్చేసినందుకు కోర్టుకు వెళ్లాలని మందిర ధర్మకర్తలు ఆలోచిస్తున్నారు. జైన మతానుయాయులు శనివారం కె-తూర్పు వార్డ్ ఆఫీసు దగ్గర భారీ సంఖ్యలో నిరసనకు దిగారు. మందిరాన్ని కూల్చి వేయడం వల్ల కొన్ని మతపరమైన గ్రంథాలు కూడా ధ్వంసం అయిపోయాయి. అక్రమంగా నిర్మించింది మందిరం అయితే ఆ విషయమై చర్య తీసుకోవడానికి బృహన్ముంబై అధికారులకు అధికారం ఉండొచ్చు. కానీ ఆ క్రమంలో మత గ్రంథాలను కూడా ధ్వంసం చేసే అధికారం ఆ అధికారులకు ఎక్కడి నుంచి వచ్చింది. ఇలాంటి విధ్వంసక చర్యలు కచ్చితంగా ఇతర మతాల మీద కత్తిగట్టినట్టు దాడి చేయడమే అనుకోవాలి. స్థానిక హోటల్ యజమాని ప్రేరేపించినందు వల్ల ఈ మందిరాన్ని కూల్చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. అదే నిజమైతే బీజేపీ ప్రభుత్వం ఇతర మతాల మీద దాడి చేయడమే కాదు, తమకు ఇంపైన వ్యాపారస్థులకు కొమ్ము కాస్తోందని భావించవలసి వస్తుంది. ఈ విధ్వంసకాండపై బృహన్ముంబై అధికార ప్రతినిధిని సంప్రదించడానికి పత్రికా విలేకరులు ప్రయత్నించినప్పుడు ఆయన స్పందించకపోవడం తెలిసి తెలిసి అఘాయిత్యానికి పాల్పడ్డారన్న అనుమానాలకు ఊతం ఇస్తున్నాయి. బృహన్ముంబై ఎన్నికలు జరగలేదంటే ఆ సంస్థ నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం చేతిలోనే ఉంటుంది. అంటే ఇదేదో తెలిసీ తెలియక తొందరపాటుతో బృహన్ముంబై అధికారులు తీసుకున్న తొందరపాటు చర్య అని సరిపెట్టుకోవడానికి కూడా ఆస్కారం లేదు. ఇదే విధ్వంసకర సంఘటన భారతీయ జనతా పార్టీ అధికారంలో లేని రాష్ట్రంలో జరిగి ఉంటే సంఘ్ పరివార్ సముదాయం ఇప్పటికే నానా గగ్గోలు చేసేది. ప్రభుత్వం ఒళ్లో కూర్చున్న పత్రికలు ఎలాంటి రెచ్చగొట్టే పతాక శీర్షికలకు స్థానం ఇచ్చేవో! "కాంగ్రెస్ మందిరాన్ని కూల్చేసింది", "కాంగ్రెస్ మహా పాపం", "కాంగ్రెస్‌ను ఆ భగవంతుడు కూడా క్షమించడు" అన్న శీర్షికలతో పత్రికలు కాషయ పార్టీ సేవలో తరించి పోయేవి.

జైన మతం మన దేశంలో పుట్టిందేగా! ఇస్లాం, క్రైస్తవం లాంటి మతాలను తప్పిస్తే మిగతా మతాలన్నింటినీ హిందూ మతంలో భాగమేనని వాదించే బీజేపీ ఇప్పుడు జైనుల మీద కత్తిగట్టినట్టు ప్రవర్తించడానికి కారణం ఏమిటి? ఇతర మతాలు, అవి మన దేశంలో పుట్టినవే అయినా వాటిని సహించే శక్తి బీజేపీకి లేకపోవడమే దీనికి కారణం. అనామిక అంబర్ జైన్ అనే కవయిత్రి ఇప్పటి దాకా మోదీ ప్రభుత్వ కీర్తి గానానికి ప్రసిద్ధురాలు. కానీ మహారాష్ట్రలో జైన మందిరాన్ని ధ్వంసం చేయడంవల్ల ఆమె హృదయం హఠాత్తుగా ఆక్రోశించడం మొదలు పెట్టింది. అన్యాయాన్ని ఎదిరించాలనే ధ్యాసలేని కవయిత్రులకు ఇలాంటి అవస్థ తప్పదుగా! ఇంతకు ముందంతా ఆమె బుల్డోజర్ రాజకీయాలను సమర్థించిన ఘనురాలే. ఇప్పుడు మాత్రం అంగలారుస్తున్నారు. తమదాకా వస్తే కానీ నొప్పి తెలియదంటే ఇదే. బాబ్రీ మసీదును కూల్చేసినప్పుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ విచ్చల విడిగా బుల్డోజర్లు నడిపినప్పుడు కేరింతలు కొడ్తూ కవయిత్రిగా చెలామణి అయిన చరిత అనామికా అంబర్‌కు ఉంది. జైనులు భారీ ఎత్తున ముంబైలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నా గోదీ మీడియాలో ఈ ప్రస్తావన పీలగా కనిపించకపోవడం మీడియా దిగజారుడు తనానికి ప్రతీక. విలే పార్లే లోని జైన మందిరాన్ని బుల్డోజర్లతో కూల్చేసినందుకు కేవలం జైనులే కాదు ప్రతిపక్షాలు కూడా ఆగ్రహంతో ఉన్నాయి. భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకునే క్రమంలో ఉన్నాయి. జైనుల నిరసన కార్యక్రమంలో మహారాష్ట్రలోని ఓ మంత్రి, ఓ శాసన సభ్యుడు కూడా చేరిపోయారు. జైన మందిరాన్ని కూల్చేయడానికి ముందు బృహన్ముంబై అధికారులు ఆ సంస్థ నిర్వాహకులకు నోటీసు జారీ చేసిన మాట నిజమే. కానీ మందిర నిర్వాహకులు ముంబై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ, కోర్టు అంతిమ నిర్ణయం ఏదీ ప్రకటించడానికి ముందే బృహన్ముంబై సంస్థ పార్శ్వనాథ మందిరాన్ని కూల్చేయడం దుస్సాహసమే. న్యాయస్థానాలంటే లెక్క లేకపోవడమే. హైకోర్టులో గురువారం జైన మందిర నిర్వాహకులు పెట్టుకున్న పిటిషన్ మీద విచారణ జరగాల్సి ఉంది. కనీసం అప్పటి దాకా వేచి చూసే ఓపిక కూడా బృహన్ముంబై అధికారులకు లేకపోవడం డబుల్ ఇంజన్ సర్కార్ ప్రోద్బలం వల్లే కావొచ్చు. జైనులది అహింసా సిద్ధాంతం. శనివారం వారి నిరసన ప్రదర్శన భారీదే అయినా శాంతియుత పద్ధతిలోనే జరిగింది. ఇంతకు ముందు స్మార్టు సిటీ పేరుతో బెనారస్‌లో డజన్ల కొద్దీ మందిరాలను కూల్చేశారు. అప్పుడే జనాక్రోశం వెల్లి విరిసి ఉంటే ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కారు జైన మందిరాన్ని కూల్చే దుస్సాహసానికి పాల్పడి ఉండేది కాదేమో. బీజేపీ అధికార మదాంధత ప్రజల మనోభావాలను పట్టించుకునే స్థితిలో లేదు అని తేలిపోయింది. బీజేపీ ధోరణి చూస్తూ ఉంటే ఎవరినీ వదిలిపెట్టేట్టుగా కనిపించడం లేదు. ముస్లింలు మాత్రమే కాదు ఏ అల్పసంఖ్యాక వర్గాలనైనా సహించే స్థితిలో సంఘ్ పరివార్ సర్కారు లేదని స్పష్టం అయిపోయింది. గ్రాహం స్టెయిన్, ఆయన పిల్లలను హత్య చేసిన వారిని సత్ప్రవర్తన పేరుతో జైలు నుంచి విడుదల చేసిన ప్రభుత్వం నుంచి ఇంతకన్నా ఏం ఆశించగలం!

అందరికీ అమ్మ ప్రేమ పంచిన రమణమ్మ

ఆరేడు దశాబ్దాల క్రితం ఎక్కువగా కమ్యూనిస్టు కుటుంబాలలో భార్యాభర్తలు కమ్యూనిస్టులుగా ఉద్యమాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అలాంటి కుటుంబాలలో రావులపల్లి చెంచయ్య, రమణమ్మ కుటుంబం పేరెన్నిక గలది. ప్రకాశం జిల్లా మార్కాపురం స్థావరంగా కమ్యూనిస్టు ఉద్యమంలో చెంచయ్య, రమణమ్మ పాత్ర విశిష్టమైంది. ఉద్యమంలో ప్రత్యేకించి మహిళా సమాఖ్య కార్యకలాపాలు, పోరాటాలలో రమణమ్మ గణనీయమైన పాత్ర నిర్వహించారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే అధిక ధరలకు వ్యతిరేకంగా, అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఆందోళనల్లో రమణమ్మ క్రియాశీలంగా పాల్గొన్నారు. సారా నిషేధం కోసం సీపీఐ ఇచ్చిన పిలుపులో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఆందోళనకు మార్కాపురంలో భారీ సంఖ్యలో మహిళలను సమీకరించి రమణమ్మ ఎంతో క్రియాశీలంగా పాల్గొని విజయవంతం చేశారు. పూలసుబ్బయ్య సతీమణి శాయమ్మ రమణమ్మతో పాల్గొన్నారు. అలాగే సంపూర్ణ అక్షరాస్యత కోసం మార్కాపురంలోనే గాక, పరిసర గ్రామాల్లో రాత్రిపూట యువతీ యువకులకు బడులు నడపడంలోనూ పాల్గొన్నారు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మహిళా సమాఖ్య, సీపీఐ ఇచ్చిన ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉద్యమ కార్యకర్తలకు, నాయకులకు ఏ సమయంలో ఎందరు వచ్చినా తల్లిలాగా వండి పెట్టడంలో ముందుండేవారు. ఇంట్లో ఎన్ని ఇబ్బందులున్నా, అవసరమైతే ముందుగా అతిథులకు భోజనం పెట్టేవారు. ఆ తర్వాతే తమ పిల్లలకు పెట్టేవారు. ఉన్న దానితో సర్దుకుపోవడం రమణమ్మ తర్వాతే మరెవరైనా అనిపించేవారు.

1953 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రభుత్వ టీచరు పోస్టుకు చెంచయ్య రాజీనామా చేసినప్పటికీ రమణమ్మ ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా పార్టీ నిర్ణయాన్ని సమర్థించారు. 200 ఓట్ల తేడాతో చెంచయ్య ఓడిపోయారు. ఎన్నికలప్పుడు పార్టీ కార్యకర్తలు ఎక్కువగా ఇంటికి వచ్చినప్పుడు భోజనాలు ఏర్పాటు చేయవలసి వచ్చినా వెనుకాడేవారు కాదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ కార్యకర్తలు ఎక్కువగా ఇంటికి వచ్చేవారు. వాళ్లకు అవసరమైతే టిఫిన్లు, భోజనాలు తయారు చేసేవారు. నాయకులు వచ్చినప్పుడు వాళ్ల నిద్రకు మంచాలు ఏర్పాటు చేసి కుటుంబీకులంతా కిందే పడుకోవడం అలవాటు చేసుకున్నారు. పార్టీ జాతీయ స్థాయి నాయకులు చండ్ర రాజేశ్వరరావు లాంటి నాయకులు ఇంటికి వచ్చినప్పుడు వారికి భోజనం, నిద్ర వసతులు ఏర్పాటు చేయడమేగాక వారి బట్టలు ఉతకడం చేసేవారు. అప్పుడు రాజేశ్వరరావుగారు చెంచయ్యను, రమణమ్మను కోప్పడిన సంఘటన మరవలేనిది. ఎన్ని పనులున్నా పార్టీ కార్యకలాపాల్లో రమణమ్మ చురుకుగా పాల్గొనేవారు. రాయలసీమ ప్రాంతంలో ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలు జరిగాయి. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శిగా చెంచయ్య పని చేసినప్పుడు ఇంటికి వచ్చిపోయే వారితో తీరిక లేకుండా రమణమ్మ పని చేసేవారు. ఈ ప్రాంతంలో అయ్యగాని పల్లెలో భూ పోరాటం, మార్కాపురంలో భూ పోరాటం పెద్ద ఉద్యమాలు. మార్కాపురంలో పోరాటం ఫలితంగా 2 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా అనంతరం వారికి పార్టీ నాయకత్వంలో ఇళ్లు కట్టించారు. 1992 లో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమం సందర్భంగా చెంచయ్య, అనేక మంది కార్యకర్తలేకాకుండా రమణమ్మను కూడా పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

గుంటూరు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామం రమణమ్మ జన్మించిన గ్రామం. ఆమె తల్లిదండ్రులిది సాధారణ రైతు కుటుంబం. తల్లిదండ్రులు వీరవల్లి ముసలయ్య, పిచ్చమ్మ. స్వగ్రామంలో ఐదో తరగతి వరకు రమణమ్మ చదువుకున్నారు. ఏడవ తరగతి వరకు చదివే అవకాశం ఉన్నా చదువు కొనసాగించలేదు. 14 వ ఏటనే 1948లో ముడివేముల గ్రామానికి చెందిన రావులపల్లి చెంచయ్యతో వివాహం జరిగింది. ఆయనది కమ్యూనిస్టు కుటుంబం అయినా తల్లిదండ్రులు వెనుకాడకుండా వివాహం చేశారు. చెంచయ్య ప్రభుత్వ పాఠశాలలో లెక్కల టీచరుగా పని చేసేవారు. వివాహం జరిగిన తరువాత కొద్ది కాలానికే కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించటంతో అండర్ గ్రౌండ్‌లో ఉండే కమ్యూనిస్టు నాయకులకు చెంచయ్య కొరియర్‌గా పని చేశారు. మాలకొండ అడవుల్లో ఎక్కువగా నాయకులు తల దాచుకునేవారు. వారి కోసం చెంచయ్య సరుకులు ఇతరత్రా అవసరమైన వస్తువులు కొనుగోలు చేసి అడవులకు వెళ్లి అందజేసి వచ్చేవారు. రమణమ్మకు పెళ్లి సమయంలో ఇచ్చిన బంగారు ఆభరణాలు అమ్మివేసి నాయకులకు సరుకులు అందజేశారు. చివరకు రమణమ్మ పుస్తెల తాడును కూడా చెంచయ్య అమ్మేసి నాయకుల కోసం ఖర్చు చేశారు. అయినా రమణమ్మ ఎలాంటి అభ్యంతరం తెలియజేయలేదు. ఇంట్లో ఉండే రెండు గేదల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇంటి ఖర్చులకు ఉపయోగించే వారు. రమణమ్మ పెళ్లయిన కొత్తలో మర్చిపోలేని సంఘటన ఒకటి జరిగింది. పార్టీపై నిషేధ కాలం అది. గ్రామాల్లో సైతం పోలీసులు దాడులు చేసేవారు. కమ్యూనిస్టులు ఎక్కడ కనిపించినా అరెస్టు చేసి తీవ్రంగా హింసించే వారు. కొన్ని సందర్భాలలో ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపేవారు. రమణమ్మ ఇంటిలో కొంతకాలం తల దాచుకున్న కాకుమాను వెంకటేశ్వర్లు బయటకు వెళ్లడంతో పోలీసులు కాల్చి చంపారు. అలాగే రమణమ్మ తొలి కాన్పు జరిగినప్పుడు రాష్ట్ర స్థాయి పార్టీ నాయకుడు గుజ్జుల యలమందారెడ్డి ఉన్నారు. యలమందారెడ్డి చెంచయ్య గారింటికి వచ్చిన వెంటనే పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టారు. యలమందారెడ్డి బయటకు వెళ్లే అవకాశాలు లేవు. ఆ సమయంలో పని మీద రమణమ్మ పక్క ఇంటికి వెళ్లారు. అప్పుడు యలమందారెడ్డి చీర కప్పుకొని చంటిబిడ్డ వద్ద కూర్చుని బాలింతగా నటించి తప్పించుకున్నారు. అప్పుడు యలమందారెడ్డి రమణమ్మ కూతురికి భారతి అని నామకరణం చేశారు. పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన సంఘటనలు రమణమ్మ జీవితంలో చాలా జరిగాయి. రమణమ్మ జీవించినంత కాలం కమ్యూనిస్టు పార్టీ పట్ల ఎంతగానో అభిమానం చూపేవారు.

- టి.వి.ఎస్

(గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో ఆదివారం రమణమ్మ సంస్మరణ సభ జరుగుతున్న సందర్భంగా)

ఈ నీళ్లన్నీ ఏం చెయ్యాలి?

వి. శంకరయ్య



చాలా మందికి ఈ ప్రశ్న అసంగతంగా తోచవచ్చు. రాష్ట్రంలో ఏ మారు మూల ప్రాంతానికెళ్లినా సాగునీటికే కాదు, తాగునీటికి కూడా ప్రజలు వెంపర్లాడుతుంటే "ఈ నీళ్లన్నీ ఏం చేయాలి? అనే సంశయం వ్యక్తం చేస్తా ఏమిటి? అని తప్పుపట్టే అవకాశముంది. ముందుగా ఇందుకు చిన్న ఉదాహరణ చెప్పి తర్వాత అసలు కథనం వివరిస్తాను. రాష్ట్రంలో చాలా పట్టణాల్లో తాగునీటికి కుళాయి వద్ద తన్నుకోవడం మనమెరుగుదుము. అదే టవున్‌లోనే కొన్ని చోట్ల నీళ్లు పట్టుకొని మహిళలు వెళ్లిన తర్వాత కూడా మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో పైపు నుంచి తాగు నీరు పక్కనే వున్న మురుగు కాలువలోనికి పోవడం కూడా మనం చూస్తున్నాం. అంటే నీటి యాజమాన్య పద్ధతి అస్తవ్యస్తంగా వున్న చోట్ల ఇలాంటి దృశ్యాలు చూస్తుంటాం. సరిగ్గా ఇప్పుడు రాష్ట్రంలో కూడా సాగునీటి వ్యవస్థలో ఇలాంటి దురవస్థ నెలకొని వుంది. లేకుంటే ఈ ఏడాది శ్రీశైలం జలాశయానికి 1600 టీఎంసీలు నీళ్లు వస్తే ఇంకా నీటి సంవత్సరం పూర్తి కాలేదు ఏప్రిల్ 18 వతేదీకి శ్రీ శైలం జలాశయంలో కేవలం 38.39 టీఎంసీల నీరు మాత్రమే వుంది.

అదే సమయంలో ప్రకాశం బ్యారేజీ నుంచి 865 టీఎంసీలు నీళ్లు ఈ ఏడు సముద్రం పాలైనవి. అంతవరకైతే ఫర్వాలేదు. రాయలసీమ నాలుగు జిల్లాల్లో ఇప్పుడు తాగునీటి కోసం కూడా వలసలు పోవలసివస్తోంది. కాని ప్రతి ఏడాది సాగర్ కుడికాలువ కింద 132 టీఎంసీల నీరు వినియోగించ వలసి వుంటే ఈ ఏడాది దాదాపు 190 టీఎంసీలు వినియోగించారు. డెల్టా పరిస్థితి ఇదే విధంగావుంది. దొరికిన వారికి పండుగ. లేని వాడికి హుళక్కి. సాగర్ కుడి కాలువ ఆయకట్టుదారులను తప్పు పట్టవలసిన అవసరంలేదు.

రాష్ట్రంలో నీటి యాజమాన్య వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. అంతేకాదు శ్రీశైలం సాగర్‌లో నిల్వ చేయవలసిన క్యారీ ఓవర్ కింద 150 టీఎంసీల నీళ్లు ఏమయ్యాయి? పొరుగు రాష్ట్రం విద్యుదుత్పత్తి కోసం నీళ్లు సముద్రంపాలు చేసిందని చెప్పే సమాధానం సరికాదు. ప్రభుత్వాల ఉన్నత స్థాయిలో వేసవిలో ఇద్దరి అవసరాలరీత్యా సకాలంలో ఒక్క సారైనా సంప్రదింపులు జరిపారా? మనలాగే వాళ్లూ తంటాలు పడటం వేరే విషయం!

ముఖ్యమంత్రి చెబుతున్నట్లు 2027 కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తయితే మరో వైపు గోదావరి, బనకచర్ల అనుసంధానం ఒక దశకొస్తే దీనికి తోడు రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల్లో నీళ్లు అరకొరగానైనా వస్తే ఇవి కాకుండా ఈ ఏడాదిలాగా కృష్ణకు వరద పోటెత్తితే ఈ నీళ్లన్నీ ఏంచేయాలి? ఇన్ని నీళ్లు ఉపయోగించుకొనే మౌలిక సదుపాయాలు మన ప్రాజెక్టులకున్నాయా? నీళ్లు నిల్వచేసే రిజర్వాయర్‌లు వున్నాయా? రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెబుతున్నట్లు 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం పూర్తయితే అంటే 41.15 మీటర్ల ఎత్తుకు నిర్మాణం జరిగితే 115.44 టీఎంసీలు నీళ్లు నిలుస్తాయి. అందులో కాలువల సిల్ లెవల్ స్థాయి పోగా (59.44 టీఎంసీలు) నికరంగా 56 టీఎంసీల లభ్యత వుంటుంది. వరద రోజుల్లో ఇంతకు రెట్టింపు తీసుకోవచ్చును. ఈ గణాంకాలు తొలి దశవి మాత్రమే. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఒరిజినల్ డీపీఆర్ మేరకు కుడి కాలువకు 80 టీఎంసీలు నికరంగా వస్తాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గోదావరి బనకచర్ల అనుసంధానం కుడికాలువ విస్తరణ కాకుండా సమానాంతరంగా రెండవ కాలువ తవ్వితే రెండు కాలువల నుంచి వచ్చే ఆరు టీఎంసీల నీళ్లను ప్రకాశం బ్యారేజీ తీసుకోగలుగుతుందా? ఎక్కువ రోజులు ఒకేసారి అటు గోదావరి, ఇటు కృష్ణా నదుల్లో వరద రోజులు వుంటే ఏం చేయాలి? ఈ మధ్యలో బుడమేరు బేసిన్ పొంగితే పరిస్థితి ఏమిటి? ఇలాంటి సాంకేతిక అవాంతరాల నివారణకు ప్రత్యేక పథకం రూపకల్పన చేస్తున్నారా? ఇవన్నీ యక్ష ప్రశ్నలుగానే వున్నాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంత తంటాలు పడి భారీ వ్యయంతో కాలువలు, టన్నెళ్లు, అక్విడెక్టులు నిర్మించి గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు తీసుకొస్తే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వచ్చే 111 టీఎంసీలు (15+38+19+10+29=మొత్తం 111) ఏం చేయాలి? వాస్తవంలో నీటి అవసరముంది. కాని ఉపయోగించుకొనే సదుపాయాలు ఎక్కడ? అనువైన రిజర్వాయర్లు, కాలువలు లేవు. ఆచరణలో ఎదురయ్యే ఈ ఇంజినీరింగ్ సాంకేతిక సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మన ఇంజినీరింగ్ అధికారులు వివరించారా? ముందుగా కాకున్నా గోదావరి బనకచర్ల అనుసంధానం పథకానికి సమానాంతరంగా మెట్ట ప్రాంతాల్లోని ప్రాజెక్టులకు పంట కాలువలు ఏర్పాటుకు చేపట్ట వలసి ఉంది. ఇందుకు కార్యాచరణ తయారు చేస్తున్నారా? భూసేకరణ భారీ వ్యయంతో కూడినది. గోదావరి బనకచర్ల అనుసంధాన పథకం అమలుకు జల హారతి కార్పొరేషన్ పెట్టారు. అందులోనే ఇవి కూడా చేర్చినప్పుడే మెట్ట ప్రాంతాల్లోని రైతుల భయాందోళన తీరుతుంది. అయితే ఈ కార్యాచరణ కనుచూపుమేరలేదు కాబట్టే ఈ నీళ్లన్నీ ఏం చేయాలనే యక్ష ప్రశ్న ఉత్పన్నమౌతోంది.

తెలుగు గంగ పథకంలో భాగమైన వెలుగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మం సాగర్ వరకు గల 140 కిలోమీటర్ల కెనాల్ ఎంతటి దుస్థితిలో వుందో ముఖ్యమంత్రికి వివరించారా? బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి శ్రీశైలం కుడి కాలువ మొదటిలో వచ్చే గోరకల్లు రిజర్వాయర్ నిర్మాణం అసంపూర్తిగా వుందని రెండు టీఎంసీలు పంపే కాలువ వున్నా అర్ధ టీఎంసీ మాత్రమే వదులుతున్నారని బండ్‌కు రక్షణగా వుండే రివిట్‌మెంట్ జారిపోయి రిజర్వాయర్ శిథిలావస్థకు చేరుకుందని పక్షం రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. అవుకు రిజర్వాయర్ ఇదే విధంగా వుంది. గాలేరు, నగరి తొలిదశలో సర్వారాయసాగర్ నిర్మాణం జరిగినా పంట కాలువల అతీ గతీ లేదు. గాలేరు నగరి రెండవ దశ పది టీఎంసీల సామర్థ్యంతో వున్నా కనీసం కాగితాలపై కూడా రూపు రేఖలు కనుచూపుమేర కనిపించడం లేదు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలవరం (నిధులు కేంద్రం ఇస్తున్నది). గోదావరి బనకచర్ల అనుసంధానం గురించి ప్రకటనలు వెలువడుతున్నాయి గాని పెండింగ్ ప్రాజెక్టుల ఫలితాలు ప్రజలకు అందించేందుకు భారీ పథకాలకు సమానాంతరంగా చేపట్టవలసిన కార్యాచరణ గురించి ఎవ్వరూ మాట్లాడటంలేదు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాక మునుపు ఈ పథకాలపై కొద్దోగొప్పో నిధులు ఏటా వ్యయం చేసేవారు. అయితే వ్యయం చేసిన నిధులు ఏటా పెరిగిన వ్యయం మింగేసినా ఎక్కడేసిన గొంతెండి అక్కడే అన్నట్లు వుండేది. జగన్‌మోహన్ రెడ్డి అయిదేళ్ల కాలంలో ఈ పథకాలన్నీ అట కెక్కాయి. ఇప్పుడు ఒక్కో పథకం నిర్మాణ వ్యయం అయిదింతలు పెరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏ పథకం ముట్టుకున్నా షాక్ కొట్టే స్థితిలో వుంది. ఈ ఏడాది కాకున్నా వచ్చే ఏడైనా కుప్పం నీళ్లు తీసుకుపోయే పనులు జరుగుతున్నా అనంతపురం, చిత్తూరు జిల్లా రైతుల మధ్య తగాదాకు దారి తీస్తోంది. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వలసలకు నిలయంగా వున్న కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి ఊపిరిలూదే వేదవతి, గుండ్రేవుల పథకాలకు టెండర్లు కూడా పిలిచారు. ఇప్పుడు వాటిని పట్టాలకెక్కించాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూపోతే అసంపూర్తి పథకాలు ఉద్గ్రంధమే అవుతాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రమటోడ్చి నిధులు అనుమతులు సంపాదించి గోదావరి జలాలు నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమ ఇతర మెట్ట జిల్లాలకు తరలించ గలిగితే ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. కాని అదే సమయంలో మెట్ట ప్రాంతాల్లోని ప్రాజెక్టులను అటకెక్కించినా పంట కాలువలు తవ్వకున్నా ఈ భారీ పథకాలు ఆశించిన ఫలితాలు ఇవ్వవు.

విశ్రాంత పాత్రికేయులు
సెల్:9848394013

ఎన్నికల చిహ్నం మారని సీపీఐ

ఆర్వీ రామారావ్

మన దేశంలో రాజకీయ పార్టీలకు కొదవలేదు. చిన్నా పెద్దా అన్ని కలిపితే 1200కు పైనే ఉంటాయని ఓ అంచనా. ఇందులో ఎప్పుడూ ఎక్కడా ఒక్క స్థానమైనా గెలవని పార్టీలూ ఉన్నాయి. అసలు ఎన్నికలలో ఎప్పుడూ పోటీ చేయలేని పార్టీలూ ఉన్నాయి. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగే నాటికి మన దేశంలో అక్షరాస్యత చాలా తక్కువ. అందువల్ల వివిధ రాజకీయ పార్టీలకు ఎన్నికల చిహ్నాలు కేటాయించారు. బ్యాలెట్ పత్రాలపైనో, బ్యాలెట్ పెట్టెలపైనో అభ్యర్థుల పేర్లు రాసినా అవి చదివి ఓటు వేయలేని వారే ఎక్కువ ఉండేవారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు నిర్దిష్టమైన ఎన్నికల చిహ్నాలు కేటాయించే పద్ధతి అనుసరిస్తున్నారు. అలాగే రాష్ట్ర స్థాయి పార్టీలకూ ఎన్నికల చిహ్నాలు కేటాయిస్తున్నారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రాతినిధ్యం, పలుకుబడి ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల చిహ్నాలు కూడా మారిన సందర్భాలు ఉన్నాయి. 1977లో కాంగ్రెస్‌ను గద్దె దించడానికి హడావుడిగా కొన్ని పార్టీలు కలిసి జనతా పార్టీ ఏర్పాటు చేశారు. కానీ ఆ పార్టీకి ప్రత్యేకంగా ఎన్నికల చిహ్నం కేటాయించే అవకాశం లేకపోయింది. అందుకని జనతా పార్టీ అభ్యర్థులు నాగలితో ఉన్న రైతు ఎన్నికల చిహ్నంపై పోటీచేసి 295 స్థానాలు సంపాదించి మొట్టమొదటిసారి కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోంచి దించేశారు. కాంగ్రెస్‌లో ఇందిరా గాంధీని వ్యతిరేకించే వర్గం కూడా జనతా పార్టీతో కలిసిపోయి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రి అయ్యారు.

జనతా పార్టీ మూణ్నాళ్ల ముచ్చటగా ముగిసింది. అప్పుడు మునుపటి జనసంఘ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఏర్పాటు చేసింది. భారతీయ జనసంఘ్ 1951-52 నుంచి దీపం గుర్తుతో పోటీ చేసేది. భారతీయ జనతా పార్టీగా అవతరించిన తరవాత తామర పూవు గుర్తు మీద పోటీ చేస్తోంది. కాంగ్రెస్‌కు ముందు కాడెద్దుల గుర్తు ఉండేది. 1969 తరవాత కాంగ్రెస్ చీలిపోయింది. అప్పుడు ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్‌కు ఆవు దూడ గుర్తు కేటాయించారు. ఎమర్జెన్సీని సడలించిన సమయంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఆవు దూడ ఎన్నికల గుర్తు మీద పోటీ చేసింది.

జనతా పార్టీ ప్రభుత్వం పతనం అయిన తరవాత జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌ను కాంగ్రెస్ (ఆర్-రిక్విజిషనిస్ట్) అనే వారు. 1969లో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు నిజలింగప్ప ఇందిరా గాంధీని పార్టీ నుంచి బహిష్కరించారు. అప్పుడే ఆమె కాంగ్రెస్ (ఆర్) ఏర్పాటు చేశారు. అప్పుడు ఆవు దూడ గుర్తు కేటాయించారు. మునుపటి కాంగ్రెస్‌ను పాత కాంగ్రెస్ అనేవారు. 1977లో పాత కాంగ్రెస్ కాడెద్దుల గుర్తు మీదే పోటీ చేసింది. ఆ తరవాత పాత కాంగ్రెస్ అంతర్ధానం అయిపోయింది. ఆ తరవాత కాంగ్రెస్ 1978లో మళ్లీ చీలిపోయినప్పుడు ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్‌ను కాంగ్రెస్ (ఐ) అన్నారు. చేతి గుర్తు కేటాయించారు. ఇప్పటికీ అదే ఎన్నికల చిహ్నం మీద పోటీ చేస్తోంది. ఆ తరవాత పాత కాంగ్రెస్ (సంస్థాగత కాంగ్రెస్) మాయమై పోయింది.

ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాత్రమే 1952 నుంచి కంకి కొడవలి గుర్తు మీద పోటీ చేస్తోంది. నిబంధనల ప్రకారం సీపీఐ పార్లమెంటులోనూ, శాసన సభల్లోనూ తగినన్ని స్థానాలు సంపాదించలేకపోయినందువల్ల 2023 ఏప్రిల్ 10వ తేదీన జాతీయ పార్టీ హోదాను ఉపసంహరించింది. కానీ ఆరేళ్ల దాకా కంకి కొడవలి గుర్తే కొనసాగుతుంది.

సీపీఐ జెండా మీద మాత్రం కొడవలి-సుత్తి గుర్తే ఉంటుంది.

1964లో సీపీఐ చీలిపోయి సీపీఐ(ఎం) ఏర్పడినప్పటి నుంచి ఆ పార్టీ కొడవలి-సుత్తి-నక్షత్రం గుర్తుతోనే పోటీ చేస్తోంది.

విశాలాంధ్ర

5

ఆదివారం

20 ఏప్రిల్ 2025

బాలుడి హత్య కేసులో లేడీడాన్ జిక్రా అరెస్ట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని సీలంపూర్‌లో జరిగిన బాలుడి హత్య వెనుక లేడీడాన్ జిక్రా హస్తం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించి...ఆమెను అరెస్ట్ చేశారు. ఆమెకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఆమె ఎప్పుడూ 10-12 మంది గ్యాంగ్‌తో రోడ్లపై హల్‌చల్ చేస్తుంటుందని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. బాలుడు కునాల్‌ను హత్య చేసిన స్థలంలో జిక్రా కూడా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఆమె సమక్షంలోనే బాలుడు హత్యకు గురయ్యాడని పేర్కొన్నారు. గ్యాంగ్‌స్టర్ హషీమ్ బాబాతో జిక్రాకు ప్రేమ సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే ఇటీవల హోలీ సందర్భంగా తుపాకీ చేత పట్టి హల్‌చల్ చేసింది. అంతేకాకుండా రోడ్డుపై డ్యాన్స్ చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పలస్తీనా జెండా ప్రొఫైల్ ఫొటో ఉన్న జిక్రాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 15,300 మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఆమె హ్యాండిల్‌లో లేడీడాన్ అని రాసుకుంది.

డ్రగ్స్ కేసులో నటుడు చాకో అరెస్టు...బెయిల్

కొచ్చి: మలయాళ నటుడు షైన్ టామ్ చాకోను కేరళ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నారనే ఆరోపణలతో విచారణకు హాజరైన చాకోను పోలీసులు నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. అనంతరం అరెస్టు చేశారు. ఆయనను కొచ్చి కోర్టులో హాజరుపర్చగా... న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కొచ్చిలోని ఓ హోటల్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఇటీవల సోదాలు చేశారు. అయితే పోలీసు బృందం హోటల్‌కు రావడానికి కొద్దిసేపటి ముందే షైన్ టామ్ చాకో అక్కడి నుంచి పారిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఆ సమయంలో మూడో అంతస్తులో ఉన్న అతను... కిటికీలోంచి రెండో అంతస్తులోకి దూకి అక్కడి నుంచి పారిపోతున్న దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. దీంతో పోలీసులు నటుడికి సమన్లు జారీ చేశారు. విచారణకు రావాలని ఆదేశించారు. అందులో భాగంగా ఆయన తన న్యాయవాదితో కలిసి ఉదయం 10 గంటల సమయంలో ఎర్నాకుళం నార్త్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. మరోవైపు సినిమా సెట్‌లో తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఇటీవల నటి విన్సీ సోనీ అలోషియస్ ఆరోపించారు. కేరళ ఫిల్మ్ ఛాంబర్‌తో పాటు 'అమ్మ' అసోసియేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఆయనను విచారించడానికి ఓ కమిటీ ఏర్పాటైంది. కమిటీ ముందు తన కుమారుడు చాకో హాజరుకానున్నట్లు ఆయన తండ్రి వెల్లడించారు.

అమిత్ షా కుయుక్తులు ఇక్కడ సాగవు: స్టాలిన్

చెన్నై: తమిళనాడులో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తిప్పికొట్టారు. తమిళనాడు రాష్ట్రం ఎప్పటికీ ఢిల్లీ నియంత్రణలో ఉండదని స్పష్టంచేశారు. 'పార్టీలను విచ్ఛిన్నం చేయడం, సభ్యులను బెదిరించడమే బీజేపీ ప్రణాళికలు. అవి తమిళనాడులో పని చేయవని పేర్కొన్నారు. బలవంతంగా హిందీని రుద్దడంతో పాటు డీలిమిటేషన్‌తో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని అంగీకరించలేదన్నారు. 'తమిళ ప్రజలకు గుర్తింపు, గౌరవం లేని బీజేపీతో ఏఐఏడీఎంకే జతకట్టడం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహం వంటిదే' అని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు బీజేపీ ఎలాంటి బెదిరింపులకు పాల్పడుతుందో తమకు బాగా తెలుసునని స్టాలిన్ చెప్పారు. తాము అలాంటి ఒత్తిడికి లొంగిపోయే వ్యక్తులం కాదని, తమిళనాడులో అమిత్ షా కుయుక్తులు పని చేయవన్నారు. తాను బ్రతికి ఉన్నంత కాలం అమిత్ షా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు వేసే ప్రణాళికలు విజయవంతం కావని చెప్పారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

మిథున్ చక్రవర్తి

కోల్‌కతా: బెంగాల్‌లో శాంతి భద్రతలు ఘోరంగా దెబ్బతిన్నాయని, అల్లర్ల నివారణలో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరం ఉందని సీనియర్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఇటీవల వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముర్షిదాబాద్‌లో జరిగిన అల్లర్లపై ఆయన స్పందిస్తూ... 'బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశా. ఇప్పటికీ కేంద్ర హోం శాఖను అదే కోరుతున్నా. కనీసం ఇప్పుడైనా స్పందించి సైన్యాన్ని దించండి. అప్పుడు ఇక్కడ ఎన్నికలు సజావుగా జరుగుతాయి' అని అన్నారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 12వ తేదీల మధ్య షంషేర్‌గంజ్, సూటి, ధులియాన్, జంగిపూర్ ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ముగ్గురు మరణించగా... వందల మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఉద్రిక్తతల వేళ భారీగా కేంద్ర బలగాలను మోహరించాల్సి వచ్చింది. మరోవైపు.. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించొద్దన్న సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తిని ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ పట్టించుకోలేదు. మరోవైపు.. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహాట్కర్ నేతృత్వంలోని బృందం సైతం రిలీఫ్ క్యాంప్‌లలో పర్యటించింది. తొలుత మాల్దా క్యాంప్‌లలో ఉన్న బాధిత కుటుంబాలను కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది.

హిందీ వివాదం వేళ

ఠాక్రే సోదరులు ఒక్కటవుతారా?

ముంబై: జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) అమలు, హిందీ వివాదంపై తమిళనాడు, కర్నాటక తర్వాత మహారాష్ట్రలోని రాజకీయ పార్టీలు గళమెత్తాయి. మహారాష్ట్రలో హిందీ వివాదం నేపథ్యంలో ఠాక్రే కుటుంబాల మధ్య సయోధ్య కుదిరే అవకాశం కనిపిస్తోంది. ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే మళ్లీ కలిసిపోయేందుకు మార్గం సుగమమైంది. మరాఠీ గుర్తింపు, సంస్కృతికి ముప్పు ఉందనే ఆందోళనల మధ్య విడిపోయిన ఇద్దరు నేతల నుంచి కీలక వ్యాఖ్యలు వచ్చాయి. 2005లో రాజ్ ఠాక్రే సొంత పార్టీ మహారాష్ట్ర నవ నిర్మాణ సేన(ఎంఎన్ఎస్) ఏర్పాటు తర్వాత ఠాక్రే కుటుంబం విడిపోయింది. శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ సేనకు నాయకత్వం వహిస్తున్న ఇద్దరు నాయకులు వేర్వేరు కార్యక్రమాలలో మాట్లాడుతూ మహారాష్ట్ర భాష, సాంస్కృతిక ప్రయోజనాలు రాజకీయ శత్రుత్వాలకు అతీతమైనవని అన్నారు. నటుడు-చిత్రనిర్మాత మహేశ్ మంజ్రేకర్‌తో పాడ్‌కాస్ట్ సందర్భంగా బంధువుల మధ్య పునఃకలయిక అవకాశం గురించి అడిగినప్పుడు... తనకు, తన బంధువులకు మధ్య విభేదాలు చిన్నవని, మహారాష్ట్ర ప్రయోజనాలు పెద్దవని రాజ్ ఠాక్రే అన్నారు. 'ఉద్ధవ్‌కు, నాకు మధ్య వివాదాలు, తగాదాలు చిన్నవి. మహారాష్ట్ర వాటన్నిటి కంటే చాలా పెద్దది. ఈ తేడాలు మహారాష్ట్ర, మరాఠీ ప్రజల ఉనికికి ప్రమాదంగా మారుతున్నాయి. కలిసి రావడం కష్టం కాదు. ఇది సంకల్పానికి సంబంధించిన విషయం. ఇది నా కోరిక లేదా స్వార్థం గురించి మాత్రమే కాదు... మనం పెద్దగా ఆలోచించాలి. రాజకీయ పార్టీలలోని మరాఠీ నేతలంతా ఐక్యమై ఒకే పార్టీని ఏర్పాటు చేయాలి' అని అన్నారు. 2005లో తాను శివసేనతో విడిపోవడం, 2022లో శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే విడిపోవడానికి తేడాలను రాజ్ ఠాక్రే వివరించారు. 'ఎమ్మెల్యేలు, ఎంపీలు నాతో ఉన్నప్పటికీ నేను శివసేనను విడిచిపెట్టాను. అయినప్పటికీ బాలా సాహెబ్ ఠాక్రే తప్ప మరెవరి కింద పనిచేయలేదు.

నేను ఒంటరిగా వెళ్లాలని నిర్ణయించుకున్నాను. ఉద్ధవ్‌తో కలిసి పనిచేయడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఇక్కడ ప్రశ్నేంటంటే నాతో కలిసి పనిచేసే సంకల్పం ఉందా' అని రాజ్ ఠాక్రే అన్నారు. మహారాష్ట్ర మనం కలిసి రావాలని కోరుకుంటే... మహారాష్ట్రను మాట్లాడనివ్వండి. ఇలాంటి విషయంలో తన అహం అడ్డురాదని చెప్పారు. మరోవైపు, ఉద్ధవ్ ఠాక్రే కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. సయోధ్యకు షరతులతో కూడిన సంసిద్ధతను వ్యక్తం చేశారు. 'చిన్న చిన్న వివాదాలను పక్కన పెట్టడానికి నేను సిద్ధం. మహారాష్ట్ర ప్రయోజనాల కోసం మరాఠీ ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఒక రోజు వారికి, మరో రోజు వేరే వారికి మద్దతు ఇవ్వడానికి మేము వ్యతిరేకం' అని ఉద్ధవ్ అన్నారు. మహారాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే ఎవరినైనా తాను స్వాగతించనని ఆయన అన్నారు. అన్ని మరాఠీ, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో 1 నుండి 5వ తరగతి వరకు హిందీని తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలనే మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి ఇద్దరు నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేసిన సమయంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ప్రారంభించిన ఈ విధానాన్ని రెండు పార్టీలు మరాఠీ భాషకు అవమానంగా భావిస్తున్నాయి.

ఈడీ ఛార్జిషీట్‌కు బెదరం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

అహ్మదాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చార్జిషీట్ దాఖలు చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ ఛార్జిషీట్‌కు పార్టీ బెదిరిపోవడం లేదని స్పష్టం చేశారు. శనివారం ఇక్కడ జరిగిన తన ప్రధాన కార్యదర్శులు, ఇంఛార్జ్‌లు, అనుబంధ సంస్థల అధిపతుల సమావేశంలో ఖర్గే ఈ వ్యాఖ్య చేశారు. ఏఐసీసీ సమావేశం తర్వాత ఈడీ చర్య తీసుకోవడం యాదృచ్ఛికం కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'మేము భయపడబోవడం లేదు. ఈడీ ఛార్జ్‌షీట్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లు, నేషనల్ హెరాల్డ్ ఆస్తుల జప్తు అన్నీ ప్రతీకార చర్యతో కూడుకున్నవే' అని తెలిపారు. రాజకీయ కారణాల వల్ల కంపెనీ ఆస్తులను కూడా జప్తు చేశారని అన్నారు. సోనియా, రాహుల్‌పై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంపై కాంగ్రెస్ బుధవారం దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయాల వెలుపల నిరసనలు నిర్వహించింది. ప్రజా సమస్యలు, ఆర్థిక సంక్షోభం నుంచి దృష్టి మళ్లించడానికి ప్రయత్నించిన 'నిరంకుశ' ప్రభుత్వ భయాందోళన, నైతిక దివాలాకోరుతనం తమ నాయకులపై చర్యకు ఉపక్రమించిందని ఆరోపించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతరులపై నేషనల్ హెరాల్డ్ కేసులో ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. రూ.988 కోట్ల మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపించింది.

ఏప్రిల్ 9న మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌వై) లోని వివిధ సెక్షన్ల కింద దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో సోనియా గాంధీని మొదటి నిందితురాలిగా, రాహుల్ గాంధీని రెండో నిందితుడిగా పేర్కొన్నది. ఏప్రిల్ 9న సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే సమీక్షించారు. ఈ కేసును ఏప్రిల్ 25వ తేదీకి విచారణకు జాబితా చేసింది.

ఏడాది చివరిలో భారత్‌కు మస్క్

న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరిలో భారత పర్యటనకు రానున్నట్లు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత భారత పర్యటన గురించి మస్క్ వెల్లడించారు. ఇది అమెరికా, భారత్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే విషయంలో కీలకం కానుంది. దురదృష్టవశాత్తు టెస్లాలో పనిభారం కారణంగా భారతదేశ పర్యటనలో జాప్యం జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం చివరిలో జరిగే పర్యటన కోసం తాను చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎలాన్ మస్క్ భారత పర్యటన ఇప్పటికే అనేకసార్లు వాయిదా పడింది. వాస్తవానికి ఎలాన్ మస్క్ ఏప్రిల్ 21-22 తేదీలలో భారతదేశానికి రావాల్సి ఉంది. ఈ సమయంలో ఆయన నరేంద్ర మోదీని కలుస్తారని, దీంతో పాటు టెస్లా సీఈఓ, అతని బృందం ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులను కలుస్తారని వార్తలొచ్చాయి. కానీ ఇవి ఖరారు కాలేదు. దీనికి ముందు కూడా మస్క్ భారత్ పర్యటన పలుమార్లు వాయిదా పడింది. ఈ సమయంలో మస్క్ భారతదేశంలో టెస్లా తయారీ కర్మాగారం గురించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. మోదీ, మస్క్ ఇప్పటివరకు రెండుసార్లు కలిశారు. వీరిద్దరూ 2015లో కాలిఫోర్నియాలోని టెస్లా ఫ్యాక్టరీలో భేటీ అయ్యారు. ఆ తర్వాత జూన్ 2023లో న్యూయార్క్‌లో కలుసుకున్నారు. ఎలాన్ మస్క్ భారతదేశంలో 2 నుంచి 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి గురించి ప్రణాళికలు ప్రకటించనున్నారు. టెస్లా భారతదేశంలో కార్లను తయారు చేయడమే కాకుండా ఇక్కడి నుంచి ప్రపంచ దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నది. మరోవైపు చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న వేళ టెస్లా కార్ల తయారీకి భారత్ మంచి అవకాశమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. దీంతోపాటు భారత్‌లో తయారు చేసి విదేశాలకు కూడా ఎగుమతి చేసుకోవచ్చున్నారు. ఇప్పటికే ఐఫోన్లను తయారు చేస్తున్న భారత్... త్వరలో టెస్లా కార్లను కూడా సిద్ధం చేయనుంది.

డీలిమిటేషన్... ఎన్ఈపీ వివాదం

జాతీయ ప్రయోజనాలపై ప్రభావం

మాయావతి

లక్నో : రాజకీయ ప్రయోజనాల కోసం డీలిమిటేషన్, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) పై రాష్ట్రాలు, కేంద్రం మధ్య వివాదాలు ప్రజలను, దేశాన్ని బాధించడం 'సహజం' అని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి శనివారం అన్నారు. 'సుపరిపాలన అంటే రాజ్యాంగం ప్రకారం మొత్తం దేశాన్ని నడిపించేది' అని యూపీ మాజీ ముఖ్యమంత్రి తెలిపారు. 'ఎక్స్' వేదికగా ఆమె హిందీలో చేసిన ఒక పోస్ట్‌లో... 'జనాభా లెక్కలు, దాని ఆధారంగా లోక్‌సభ సీట్ల పునర్విభజన, కొత్త విద్యా విధానం, భాషా విధింపు మొదలైన వాటికి సంబంధించి రాష్ట్రాలు, కేంద్రం మధ్య వివాదాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం వల్ల ప్రజా, జాతీయ ప్రయోజనాలు దెబ్బతినడం సహజం' అని పేర్కొన్నారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన పేదలు, దళిత, గిరిజన లేదా వెనుకబడిన తరగతుల పిల్లలు ఆంగ్ల పరిజ్ఞానం లేకుండానే ఐటీ, నైపుణ్య రంగాలలో ఎలా ముందుకు సాగవచ్చనే దానిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి' అని పేర్కొన్నారు. 'భాష పట్ల ద్వేషం తగదు' అని ఆమె పోస్ట్ చేశారు.

పరీక్ష కేంద్రంలో 'జంధ్యం' వివాదం

అధికారులపై కేసు, హోంగార్డుల సస్పెన్షన్

బెంగళూరు: వృత్తి విద్య కళాశాలల్లో చేరేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాయడానికి వచ్చిన కొందరు విద్యార్థుల మెడలోని జంధ్యం తొలగించాలనడం కర్నాటకలో కొత్త వివాదానికి దారి తీసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు... ఆదిచుంచనగిరి పీయూ కాలేజీ అధికారులపై కేసు నమోదు చేశారు. దీంతోపాటు శివమొగ్గలోని ఓ పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తించిన ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు వేశారు. శివమొగ్గలోని ఆదిచుంచనగిరి పీయూ కాలేజీ కేంద్రంలోకి వెళ్లే విద్యార్థులను తనిఖీ చేసిన అధికారులు ముగ్గురు విద్యార్థులను జంధ్యం తీసివేయాలని సూచించారు. ఓ విద్యార్థి జంధ్యం తీయడం ఇష్టంలేక వెనక్కు వెళ్లిపోగా... దాన్ని తొలగించిన ఇద్దరిని పరీక్షకు అనుమతించినట్లు తెలిసింది. బీదర్‌లోనూ ఇటువంటి ఘటనే చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలపై బ్రాహ్మణ మహాసభ, బీజేపీ భగ్గుమన్నాయి. దీంతో వెంటనే స్పందించిన ప్రభుత్వం... దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప సూచనల మేరకు ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేస్తూ శివమొగ్గ పోలీసులు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులు చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేయాల్సి ఉందని జిల్లా పోలీసులు వెల్లడించారు. పూర్తిస్థాయి విచారణ జరుగుతోందన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి సెట్ నిర్వహణ విభాగానికి నివేదిక అందించినట్లు సమాచారం. కాగా, విద్యార్థుల జంధ్యం తొలగించిన ఘటనను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. రాష్ట్రంలో నకిలీ లౌకిక ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. సంబంధిత అధికార యంత్రాంగం విచారం వ్యక్తం చేసినప్పటికీ... పరీక్ష రాయని విద్యార్థులకు పరిష్కారం చూపాలన్నారు.

విద్యుత్ షాక్ ఇచ్చి...గోళ్లు పీకి...

కార్మికులపై యజమాని కర్కశం

రాయ్‌పూర్: ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో పని చేసే ఇద్దరు కార్మికులపై దొంగతనం నెపం మోపి ... ఆ ఫ్యాక్టరీ యజమాని, అతడి అనుచరుడు కలిసి వారిని చిత్రహింసలకు గురిచేసిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... ఖప్రభట్టి ప్రాంతంలోని ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాకు చెందిన అభిషేక్ భంబీ, వినోద్ భంబీ పని చేస్తున్నారు. ఈ నెల 14న వారిద్దరూ దొంగతనం చేసినట్లు యజమాని చోటూ గుర్జార్ ఆరోపించాడు. తన అనుచరుడు ముఖేశ్ శర్మతో కలిసి కార్మికుల చొక్కాలు విప్పించి చిత్రహింసలకు గురిచేశాడు. కరెంట్ వైర్‌తో వారికి విద్యుత్ షాకులు ఇచ్చాడు. పటకారుతో గోళ్లు పీకడంతోపాటు కర్రతో వారిని కొట్టారు. ఏదోలా అభిషేక్, వినోద్ ఆ ఐస్‌క్రీం ఫ్యాక్టరీ నుంచి తప్పించుకుని భిల్వారాలోని సొంతూరుకు చేరుకున్నారు. యజమాని వేధింపులపై గులాబురా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.20 వేలు అడ్వాన్స్ అడిగినందుకు విద్యుత్ షాకులతో చిత్రహింసలకు గురి చేశారని వారు పేర్కొన్నారు. వేధింపుల వీడియో క్లిప్‌ను పోలీసులకు అందజేశారు. మరోవైపు రాజస్థాన్ పోలీసులు 'జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదుపరి చర్యల కోసం ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా పోలీసులకు ఈ కేసును బదిలీ చేశారు. దీంతో ఐస్‌క్రీం ఫ్యాక్టరీ యజమాని చోటూ గుర్జార్, అతడి అనుచరుడు ముఖేశ్ శర్మపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. ఇదిలా ఉండగా, కార్మికులకు విద్యుత్ షాక్ ఇచ్చి వేధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

22న సౌదీకి మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటన ఖరారైంది. ఏప్రిల్ 22, 23 తేదీల్లో ఆయన సౌదీ అరేబియాలో అధికారిక పర్యటన జరపనున్నారు. సౌదీ క్రౌన్ ప్రిన్స్, ప్రధాన మంత్రి మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటనకు వెళ్తున్నారు. సౌదీలో మోదీ పర్యటించనుండటం ఇది మూడోసారి. 2016, 2019లో ఆయన అక్కడ పర్యటించారు. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ 2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో పర్యటించి... జి-20 సదస్సు, ఇండియా-సౌదీ అరేబియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ కౌన్సిల్‌కు కో-చైర్మన్‌గా వ్యవహరించారని, ఆ సందర్భంలో మోదీని తమ దేశంలో పర్యటించాల్సిందిగా కోరారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్, సౌదీ మధ్య చిరకాల మైత్రీసంబంధాలు ఉన్నాయి. బలమైన చారిత్రక వాణిజ్య సంబంధాలు, లోతైన సామాజిక-సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. రాజకీయ, రక్షణ, భద్రత, పెట్టుబడులు, ఇంధనం, టెక్నాలజీ, ఆరోగ్యం, విద్య రంగాల్లోనూ బలమైన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తున్నాయి.

ఎండీఎంకేకు దురై వైకో రాజీనామా

చెన్నై : అంతర్గత కలహాల నేపథ్యంలో ఎండీఎంకే నాయకుడు, దాని వ్యవస్థాపకుడు వైకో కుమారుడు దురై వైకో శనివారం పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలోని తిరుచిరాపల్లికి చెందిన లోక్‌సభ ఎంపీ వైకో తన నిర్ణయాన్ని 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. తాను రాజీనామా చేయడానికి ఒక వ్యక్తి కారణమని ఆరోపించారు. పార్టీ ఆదివారం తన అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్ సమావేశంలో దురై రాజీనామాపై నిర్ణయం తీసుకుంటుందని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. ఏప్రిల్ 20న జరిగే సమావేశంలో కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నందున పార్టీ జిల్లా యూనిట్లు ఎటువంటి తీర్మానాలను ఆమోదించవద్దని వైకో హెచ్చరించిన కొన్ని రోజుల తర్వాత దురై ఈ నిర్ణయం తీసుకున్నారు.

సుప్రీం చట్టాలు చేస్తే పార్లమెంట్ మూతే: దూబె

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం, బిల్లులపై రాష్ట్రపతికి గడువు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై బీజేపీ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఇప్పటికే వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై తాజాగా బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. 'ఒకవేళ సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే... పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి' అని దూబే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపడానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు మూడు నెలల గడువు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. గవర్నర్ పంపిన బిల్లులను రాష్ట్రపతి ఎటూ తేల్చకపోతే అప్పుడు రాష్ట్రాలు నేరుగా తమను ఆశ్రయించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పరిణామాలపై ఉపరాష్ట్రపతి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఫలానా సమయంలోగా నిర్ణయాలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించజాలదని అన్నారు. ప్రజాస్వామ్య శక్తులపై అణు క్షిపణిని సుప్రీంకోర్టు ప్రయోగించరాదని పేర్కొన్నారు. మరోవైపు న్యాయస్థానం ఉత్తర్వులను ప్రతిపక్షాలు స్వాగతిస్తున్నాయి.

ఇళ్లకు రావడానికి భయమేస్తోంది

బాధిత కుటుంబాల ఆవేదన

ముర్షిదాబాద్‌కు గవర్నర్, ఎన్‌సీడబ్ల్యూ, ఎన్‌హెచ్ఆర్‌సీ

ముర్షిదాబాద్ (పశ్చిమ బెంగాల్): ముర్షిదాబాద్ జిల్లాలో వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనల సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతాలలో గవర్నర్, ఎన్‌సీడబ్ల్యూ, ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రతినిధులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు భయపడుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. హింసలో మరణించిన బాధితుడి కుటుంబ సభ్యులను పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ కలిశారు. అన్ని విధాలుగా మద్దతుగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. హరిగోవింద్ దాస్, చందన్ దాస్‌గా గుర్తించబడిన ఇద్దరి మృతదేహాలు షంషేర్‌గంజ్‌లోని జాఫ్రాబాద్ ప్రాంతంలోని వారి ఇంట్లో అనేక కత్తిపోట్లతో కనిపించాయి. 'గవర్నర్ వారి ఇంటిని సందర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. హత్యపై వారు సీబీఐ దర్యాప్తును డిమాండ్ చేశారు' అని రాజ్ భవన్ అధికారి ఒకరు తెలిపారు. ఏప్రిల్ 8-12 వరకు ముస్లింలు అధికంగా ఉన్న ఈ ప్రాంతాలలో జరిగిన వక్ఫ్ (సవరణ) చట్ట వ్యతిరేక నిరసనల సందర్భంగా జరిగిన హింసకు సంబంధించి తండ్రి, కొడుకు సహా ముగ్గురు మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వారి ఇళ్లు మూకుమ్మడి అల్లర్లలో దహనమయ్యాయి. ఈ హింసాత్మక ఘటనలకు సంబంధించి 274 మందికి పైగా అరెస్టు అయ్యారు. షంషేర్‌గంజ్ వెళ్లడానికి ముందు గవర్నరు బోస్ ఫరక్కాలో ఒక అతిథి గృహంలో బాధిత కుటుంబాల సభ్యులతో మాట్లాడారని అధికారి తెలిపారు. తన పర్యటనను వాయిదా వేయాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరినప్పటికీ...గవర్నరు మాల్దాను సందర్శించి, ముర్షిదాబాద్ జిల్లాలోని హింసాకాండ ప్రభావిత ప్రాంతాల నుంచి పారిపోయి తాత్కాలిక శరణార్థి శిబిరంలో ఆశ్రయం పొందిన ప్రజలను కలిశారు. వారి ఫిర్యాదులను పరిష్కరించడానికి చురుగ్గా చర్య తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ధులియన్‌లో బాధితుల నిరసన

ధులియన్‌లో గవర్నర్ సీవీ బోస్, ఎన్‌సీడబ్ల్యూ, ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రతినిధులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారి ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. తొలుత గవర్నర్ ధులియాన్‌లోని వార్డు-16లోని వేదవన గ్రామం నుంచి స్థానికులను కలవకుండా వెళ్లిపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి గొడవ సృష్టించారు. అంతకుముందు జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ నేతృత్వంలోని బృందం హింసాకాండ బాధిత ప్రజలను పరామర్శించడానికి ముర్షిదాబాద్‌లోని ధులియన్‌కు చేరుకుంది. ధులియన్‌లో బాధితులను మహిళా కమిషన్ సభ్యురాలు కలిశారు. ఆమె ఎదుట బాధితులు తీవ్రంగా విలపించారు. 'ముందుగా ఇక్కడి ప్రజలతో మాట్లాడనివ్వండి. ఆ తర్వాతే నేను మరింత వ్యాఖ్యానించగలను. ఇప్పటివరకు మనం చూసిన దాని ప్రకారం పరిస్థితి చాలా బాధాకరం. వారి బాధను మనం ఇప్పటికే గ్రహించగలం' అని రహత్కర్ ముర్షిదాబాద్ చేరుకున్న తర్వాత మీడియా ప్రతినిధులతో అన్నారు. శుక్రవారం ఎన్‌సీడబ్ల్యూ బృందం మాల్దాకు చేరుకుని ముస్లిం-మెజారిటీ ప్రాంతాలలో జరిగిన హింసాకాండతో ప్రభావితమైన మహిళలతో సంభాషించింది. అదే రోజు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) ప్రతినిధి బృందం బైష్ణబ్‌నగర్‌లోని పర్లాల్‌పూర్ హైస్కూల్‌లోని తాత్కాలిక ఆశ్రయ శిబిరాన్ని సందర్శించింది. ఈ శిబిరంలో ధులియన్ నుంచి నిరాశ్రయులైన కుటుంబాలు ఆశ్రయం పొందుతున్నాయి. ముగ్గురు సభ్యుల ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రతినిధి బృందం...బాధిత కుటుంబాలతో మాట్లాడి హింసకు దారితీసిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నది.

వీహెచ్‌పీ నిరసన... రాష్ట్రపతి పాలనకు డిమాండ్

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన హింసకు నిరసనగా విశ్వ హిందూ పరిషత్ సోన్‌భద్ర విభాగం శనివారం కలెక్టరేట్ వద్ద ప్రదర్శన నిర్వహించింది. ముందుగా కార్యకర్తలు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. దీని తరువాత రాష్ట్రపతి పేరుతో జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పించారు. వక్ఫ్ బిల్లు ద్వారా ముర్షిదాబాద్‌లోని హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నారని వీహెచ్‌పీ కాశీ ప్రావిన్స్ నాయకుడు నర్సింగ్ త్రిపాఠి అన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని రద్దు చేసి... రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ సమాజ భద్రత కోసం సైన్యాన్ని మోహరించాలన్నారు. ముర్షిదాబాద్‌లో హిందువులు లేకుండా చేయడానికి మమతా బెనర్జీ ప్రయత్నిస్తున్నారని త్రిపాఠి ఆరోపించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మరోసారి హైడ్రా దూకుడు

ఏపీ టీడీపీ ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు చెందిన అక్రమ నిర్మాణాల తొలగింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అక్రమ కూల్చివేతలపై హైడ్రా మరోసారి దూకుడు పెంచింది. శనివారం నగరంలోని హఫీజ్ పేట్ పరిదిలో సుమారు 17 ఎకరాల ప్రభుత్వ భూములలో వున్న అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. ఈ కూల్చివేతలతో వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించినట్లు అయ్యింది. అయితే ఈ భూములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్‌కు చెందినవి కావడం గమనార్హం. ఈ చర్యలతో రెండు రాష్ట్రాల్లో వున్న రాజకీయ నాయకులలో ప్రకంపనలు సృష్టిస్తుంది. ముందుగా హైడ్రా కమీషనర్ చెప్పిన విధంగా బడాబాబులు ఉన్నా లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారు. తాజాగా హఫీజ్ పేట్ పరిధిలోని పదిహేడు ఎకరాలలో ప్రభుత్వ భూములలో ఉన్న ఆక్రమణల కూల్చివేశారు. మరోవైపు హైడ్రా వల్ల తమకు మేలు జరిగిందని హైడ్రా జిందాబాద్ అంటూ ఇంజాపూర్ కాలనీవాసులు స్వీట్లు పంచుకున్నారు. వనస్థలిపురం ఇంజాపూర్ రోడ్డు ఆక్రమణలను కూల్చివేసి హైడ్రా అధికారులు రోడ్డు క్లియర్ చేశారు. హైడ్రా చర్యలతో 7 కాలనీలకు విముక్తి కలిగింది.

ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్పందన...

ఈ అక్రమ కూల్చివేతపై ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్పందిస్తూ తాను 2005లో ఈ భూమిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ ల్యాండ్‌పై ఎలాంటి అభ్యంతరాలు లేవని రంగారెడ్డి కలెక్టర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చినట్లు చెప్పారు. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించామని అయినా కూడా హైడ్రా అధికారులు తమ ఆఫీసు మొత్తాన్ని కూల్చేశారంటున్న టీడీపీ ఎమ్మెల్యే వాపోయ్యారు.

సికింద్రాబాద్‌లో లలితా జ్యువెలరీ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : 40 సంవత్సరాలకుపైగా దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలితా జ్యువెలరీ 61వ షోరూమ్‌ను సికింద్రాబాద్‌లోని ఆర్.పి.రోడ్‌లో లలితా జ్యువెలరీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో పలు ప్రాంతాలలో లలితా జ్యువెలరీ విశేష ఆదరణ పొందిందని ఇప్పుడు సికింద్రాబాద్ చుట్టుపక్కల ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రారంభోత్సవం ఆఫర్ కింద బంగారు నగలపై తరుగులో రెండు శాతం మూడు శాతం తగ్గింపుతో పాటు వజ్రాభరణాలకు క్యారెట్‌కు 6000 రూపాయల వరకు తగ్గింపుని ఇస్తున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు ఫ్రీ అండ్ ఫ్లెక్సీ 11 నెలల నగల కొనుగోలు పథకాన్ని వినియోగదారులకు అందుబాటులో ఉంచామని లలిత జ్యువెలరీ షోరూంలలో మార్కెట్ కంటే తక్కువ తరుగులో బంగారు నగలను అందజేస్తున్నామని తెలియ జేశారు. లలిత జ్యువలరీ షోరూమ్‌లో తమకు నచ్చిన నగదు ఫోటోను పెట్టుకొని అందుకు ఎస్టిమేట్ స్లిప్పును తీసుకొని ఆ రెండిటిని నాలుగైదు షో రూమ్‌లో ధరలు పోల్చి చూసి కొనాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లోని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గౌడ మహిళలను గుడి నుంచి బహిష్కరించిన వారిపై

చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపురం గ్రామంలో శ్రీరామనవమి రోజున గౌడ కల్లుగీత కార్మిక మహిళలను బహిష్కరించి గెంటివేసిన వీడిసి విలేజ్ డెవలప్మెంట్ కమిటీని కఠినంగా శిక్షించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వృత్తి సంఘాల కమిటీ డిమాండ్ చేయుచున్నది. శ్రీరామనవమి రోజున గౌడ మహిళలను బహిష్కరించి గుడిలో నుంచి గెంటివేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా పది ఎకరాలలో ఉన్న ఈత వనాన్ని తగులు పెట్టి గీతా కార్మికుల జీవనోపాధిని లేకుండా చేయటం జరిగింది. ఈ కమిటీ వారికి నచ్చని వారిని బహిష్కరించటం జరిమానాలు వేయటం డబ్బులు వసూలు చేయడం జరుగుతున్నది. ఇటువంటి వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ నిరసనలో మేడ్చల్-మల్కాజి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు వి.వెంకట నరసయ్య, కార్యదర్శి కప్పల లింగం గౌడ్, జిల్లా కోశాధికారి సట్ల ప్రభాకర్ గౌడ్, పంజాల యాదగిరి గౌడ్, చరణ్ గౌడ్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మామిళ్ల జగదీష్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో రన్ ఫర్ జీసస్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నేరేడ్‌మెట్ చౌరస్తా నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రపంచ శాంతి నెలకొనాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చి పాస్టర్లు, పలు రాజకీయ పార్టీల నాయకులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు సంజీవరావు, సంతోష్ కుమార్, పాస్టర్లు రాజు, జాన్ పాల్, జోసఫ్, బెన్హర్, సత్తయ్య, రాము, దాస్, సంజీవ్, కాంతి కుమార్, సిద్దు, యోనా, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరంలో నల్లాలకు అక్రమంగా మోటార్లతో నీటిని తోడుతున్న వారిపై దాడులు కొనసాగుతున్నాయి. జలమండలి అధికారులు క్రమంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జలమండలి పైపులైనుకు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న మోటార్లు సీజ్ చేశారు. శనివారం ఓ అండ్ ఎం డివిజన్ పరిధిలో నీటి సరఫరా సమయంలో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 32 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. మరో 42 మందికి నీటి వృధా చేసినందుకు పెనాల్టీ విధించారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది. ఒకవేళ తక్కువ ప్రెజర్‌తో నీరు సరఫరా ఐనా లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా, తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని, లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తామని జలమండలి అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి యాసంగి 2024-25 సీజన్ ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డి.ఎస్.చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో యాసంగి వడ్ల కొనుగోలు, సన్న బియ్యం పంపిణీ, త్రాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కొరకు రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యాసంగి సీజన్‌లో 70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, రాష్ట్రంలో 8 వేల 329 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 8 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, అధికారులు గోదాములలో ఉన్న సన్న బియ్యం నిల్వలను పరిశీలించాలని, నాణ్యత పరిశీలించాలని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల నుండి తరలించడానికి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్రాగునీటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతమ్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ అస్తిత్వ ప్రకటనలో భాగంగా, తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు, పరిపోషణకు విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టడం ఎంతో సముచితంగానూ, స్ఫూర్తిదాయకంగాను ఉందని తెలుగు విశ్వవిద్యాలయం బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థుల పక్షాన ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సాహిత్య, సామాజిక చారిత్రక రంగాలలో విశిష్టమైన పాత్ర నిర్వహించి తెలంగాణలో చైతన్య జ్యోతులను వెలిగించిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించడం ఎంతో సముచితం గాను ప్రశంసనీయంగాను ఉందని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం విజయవంతమై తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన కొద్ది కాలంలోనే 2014లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జయశంకర్ విశ్వవిద్యాలయంగా, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చుకోవడం జరిగింది. కొండా లక్ష్మణ్ బాపూజీ, వీరనారి చాకలి ఐలమ్మలాంటి తెలంగాణా వైతాళికుల పేర్లనుకూడా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు పెట్టడం జరిగిందన్నారు. ఒక మహా ఉద్యమం సాగిన కాలంలో ఇవి చాలా సహజ పరిణామాలు. తెలంగాణ అస్తిత్వ సూచకంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చాలని రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఆమోదించింది. సురవరం ప్రతాపరెడ్డి ఒక విశిష్ట చరిత్రకారునిగా, సామాన్య జనుల జీవితాలను చిత్రించిన కథా రచయితగా, రామాయణ మహా గ్రంథంలోని తార్కిక చారిత్రకాంశాలను వెలుగులోకి తెచ్చిన పరిశోధకునిగా అందరికీ తెలుసు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికను ప్రారంభించి తెలంగాణ ప్రజలలో పోరాటపటిమను, తెగువను, చైతన్యాన్ని నింపిన ధైర్యశాలి. సబ్బండ వర్గాల జనజీవితాన్ని వైవిధ్యభరితంగా చిత్రీకరిస్తూ వారు రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ విశిష్ట పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. తెలుగు నాట చరిత్ర అంటే రాజుల చరిత్రనే కాదనీ సామాన్యుల గురించి చిత్రీకరించేదే నిజమైన చరిత్ర అని నిరూపించిన ప్రజా పక్షపాతి సురవరం ప్రతాపరెడ్డి. నిజాముకు వ్యతిరేకంగా తెలంగాణలో ఏర్పాటైన జోగిపేటలో జరిగిన ప్రప్రథమ ఆంధ్ర మహాసభకు అధ్యక్షులై దిశానిర్దేశం చేసిన చైతన్యశీలి అని కొనియాడారు.

ఈడి కార్యాలయ ముట్టడికి యత్నం

భారీ నిరసన ర్యాలీ - నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీని, కాంగ్రెస్ కీలక నేత సోనియాగాంధీ లను నేరుగా ఢీకొన్న లేక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు వారిపై కక్ష సాధింపు చర్యలు పూనుకుం టున్నారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీల పేర్లను చార్జీషీట్‌లో పెట్టడాని నిరసిస్తూ యూత్ ఆధ్వర్యంలో శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈడీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు భారీ ర్యాలీగా ఈడీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో క్రమంలో పోలీసులు వారిని అరెస్టు చేసి బహదూర్‌పుర, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్, ఉపాధ్యక్షులు హారుణ్ గౌడ్, దీపక్ ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి అందే మోహన్‌లు మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో ఈడీ సోనియా, రాహుల్‌గాంధీ పేర్లను చేర్చడం దారుణమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పత్రికను మూసివేసి నప్పటికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షాలు సోనియా, రాహుల్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నా రని ఆరోపించారు. బీజేపీ కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంశి గౌడ్ అందె శ్రీకాంత్ లడ్డు యాదవ్ తేజ కిరణ్ అజయ్ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణ దిశగా సింగరేణి తొలి అడుగు విజయవంతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి ఇతర రాష్ట్రాల విస్తరణలో తొలి అడుగుగా ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గనిని విజయవంతంగా ప్రారంభించడం జరిగిందని, ఇదే స్ఫూర్తితో ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో మరిన్ని గనులు, ఇతర ఖనిజ ఉత్పత్తులను కూడా చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. నైనీ బొగ్గు గని ప్రారంభంతో సింగరేణి ఎక్కడైనా విస్తరించగలదన్న భరోసా, నమ్మకం అందరిలో కలిగిందన్నారు. నైనీ బొగ్గు బ్లాకును ప్రారంభించిన సందర్భంగా శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు సీఎండీ ఎన్.బలరామ్‌కు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నైనీ బొగ్గు బ్లాకు సాధన వెనుక రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి ప్రత్యేక చొరవతో పాటు, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి, ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే, వివిధ శాఖల అధికారుల సహకారం ఉందని, తాను ఈ ప్రక్రియలో సమన్వయ బాధ్య తను స్వీకరించడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలంలో అనేక మంది మాజీ సింగరేణి అధికారులు కూడా తమ వంతుగా కృషి చేశారని వారికి అభినందనలు తెలిపారు. సింగరేణి సంస్థ ఇకపై కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ గానే కాకుండా ఇతర ఖనిజాల ఉత్పత్తి సంస్థగా కూడా ఎదగనున్నదని, థర్మల్ విద్యుత్తుతో పాటు, పునరుత్పాదక విద్యుత్తు రంగంలో కూడా విస్తరించనున్నదని తెలిపారు. ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ రాజకుమార్ మాట్లాడుతూ నైనీ సాధనలో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో పాటు చైర్మన్ ఎన్.బలరామ్ ప్రత్యేక కృషి ప్రశంసనీయమని పేర్కొంటూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో సమావేశంలో అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, అధికారుల సంఘం నాయకులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు, సీ.ఎం.ఓ.ఏ.ఐ ప్రతినిధులు కూడా నైనీ బొగ్గు గనిని సింగరేణి సాధించటం ఒక చారిత్రక ఘట్టమని, దీనిలో చైర్మన్ కృషి ఎంతో ఉందని ప్రశంసలు కురిపించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభాని నైనీ బొగ్గు గని నుండి తీసిన తొలి బొగ్గు పెళ్ళతో చైర్మన్ ఉన్న చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించి శాలువతో సన్మానించారు. కొత్తగూడెం నుంచి సంస్థ డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు, డెరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ రావు, డెరెక్టర్ వెంకటేశ్వర్లు, జీ.ఎం. (సీపీపీ) మనోహర్, కార్పోరేట్ విభాగాల అధిపతులు, హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి జీఎం (మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖర్ రావు ఆయా ఏరియాల జీ.ఎం లు పాల్గొన్నారు.

ఆ రెండువేల మందికి నోటీసులు ఇస్తారా : స్మితా సబర్వాల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హెచ్‌సీయూలో విషయంలో ఓ ఫోటోను ఐఏఎస్ స్మితా సబర్వాల్ రీపోస్ట్ చేసిన నేపథ్యంలో అమెకు గచ్చిబౌలి పోలీసులు విచారణకు పిలిచిన విషయం తెలిసిందే. శనివారం అమె గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరైయ్యారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి సంబంధించిన ఏఐ ఫొటోను తన ఎక్స్ ఖాతాలో రీపోస్ట్ చేయడంతో పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె విచారణకు హాజరై పోలీసులకు స్టేట్మెంట్ ఇచ్చారు. 2 వేల మంది అదే పోస్టును షేర్ చేశారని, వారందరిపై కూడా చర్యలు తీసుకుంటారా? అని స్మితా సబర్వాల్ ప్రశ్నించినట్లు సమాచారం. అయితే చెట్ల తొలగింపునకు సంబంధించిన కొన్ని ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై తెలంగాణ సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఏఐ ఫొటోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడింది. ఈ క్రమంలోనే ఐఏఎస్ స్మితా సబర్వాల్ ఫేక్ ఫొటోలు రీపోస్టు చేశారంటూ పోలీసులు ఆమెకు నోటీసులు అందించారు.

సింగరేణి హైస్కూల్లో సీబీఎస్ఈ బోధనకు అనుమతి మంజూరు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి ప్రాంతంలో కార్మికుల పిల్లలకు సెంట్రల్ సిలబస్‌తో కూడిన విద్యను అందించాలన్న ఉద్దేశంతో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తీసుకున్న ప్రత్యేక చొరవతో సత్ఫలితానిచ్చింది. రామగుండం-2 ఏరియాలో గల సింగరేణి హైస్కూల్ సెక్టర్-3 పాఠశాలలో సీ.బీ.ఎస్.ఈ బోధనకు అనుమతి మంజూరు అయింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ శాఖ నుండి ఆ పాఠశాలకు అఫ్లికేషన్‌ను మంజూరు చేస్తూ ఏప్రిల్ 19న సర్టిఫికెట్ జారీ అయింది. సింగరేణి విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్న ఉద్దేశంతో ఏడాది క్రితం సంస్థ చైర్మన్ ఎన్.బలరామ్ సీ.బీ.ఎస్.ఈ వారిని సంప్రదించారు. సింగరేణి పాఠశాలలు అన్ని రకాల సౌకర్యాలతో, ల్యాబ్‌లు, క్రీడ మైదానాలు విశాలమైన తరగతి గదులు వంటి వసతులతో ఉన్నాయని, తగిన అర్హతలు గల బోధనా సిబ్బంది కూడా ఉన్నందువల్ల కార్మికుల పిల్లలకు ఉన్నత స్థాయి విద్యను అందించేందుకు ఈ పాఠశాలల్లో సీ.బీ.ఎస్.ఈ బోధనకు అనుమతించాలని కోరారు. దీనిపై గత ఏడాది డిసెంబరు నెలలో సీ.బీ.ఎస్.ఈ అధికారుల బృందం రామగుండం-2 ఏరియాలో గల సింగరేణి హైస్కూల్‌ను గత ఏడాది డిసెంబర్‌లో, ఈ ఏడాది ఫిబ్రవరిలో సందర్శించి అక్కడ గల వసతుల్ని పరిశీలించారు. సీ.బీ.ఎస్.ఈ బోధనకు ఈ పాఠశాల అనుకూలంగా ఉందని గుర్తించారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఈ పాఠశాలకు తమ అఫ్లియేషన్ (3630560) మంజూరు చేస్తూ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. 1 నుంచి 8వ తరగతి వరకు సీబీఎస్ఈ తరగతులకు అనుమతులు ఇచ్చింది. ఈ విద్యాసంవత్సరం నుంచి సీ.బీ.ఎస్.ఈ విద్యాబోధన ప్రారంభం కానుంది. సీ.బీ.ఎస్.ఈ బోధనతో సింగరేణి పాఠశాలలకు పూర్వవైభవం చేకూరనున్నదని కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలోనూ సీబీఎస్ఈ పాఠశాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు.

ముకుంద జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని గంగా రాంలో నూతనంగా ఏర్పాటు చేసిన ముకుంద జ్యువెలర్స్ షోరూమ్‌ను ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ గంగారాంలో ముకుంద జ్యువెలర్స్ షోరూమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనియం అని, ప్రజలకు కావాల్సిన అన్ని రకాల నగలు అందుబాటులో సరమైన ధరలకు లభించడం సంతోషకరమైన విషయం అని, వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు నగలు లభించడం గొప్ప విషయం అని, వినియోగదారులు దేవుళ్ళతో సమానము కావున వారి అభిరుచికి తగ్గట్టు వారి మన్ననలు పొంది జ్యువెలర్స్ రంగంలో దినదినాభివృద్ధి చెంది మార్కెట్‌లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని నిర్వాహకు లను అభిలాషించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండీఇబ్రహీం, నరేందర్ బల్లా పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : డ్రైనేజీలు పొంగి పొర్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులకు లోనవుతున్నా పరిస్థితిని నెలకొంటుంది. మల్కాజిగిరి డివిజన్ బాల సరస్వతి నగర్‌లో (ఆత్మ లింగ మహా గణపతి ఆ లయ రోడ్డులో) గత 20 రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. డ్రైనేజీ పొంగి పొర్లుతుందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీ ప్రజలు చెప్పినా, ప్రజాప్రతినిధులు చెప్పినా అధికారుల తీరు మెరుగుపడని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ దుర్గంధాన్ని ప్రజలు భరించలేక పోతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు వెంట వాహనాలు వెళ్ళుతున్న సమయంలో ఈ నీరు ప్రజలపై చిల్లుతూ ఇబ్బందులకు లోనవుతున్న పరిస్థితి నెలకొంటుందని, అధికారులు తమకు తెలిసినా కూడ పట్టించుకునే పరిస్థితినిలో ఉండడం దారుణమన్నారు. సోమవారం ఇక్కడి అధికారుల తీరుపై జలమండలిలో ప్రజావానిలో ఫిర్యాదు చేసేందుకు కాలనీల వాసులు సమాయత్తం అవుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

రైతుకు, భూమికి ఉన్న బంధమే భూ భారతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : రైతుకు భూమికి ఉన్న బంధమే భూ భారతి అని ఎమ్మెల్సీ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ హాల్, శంకర్ పల్లి బద్దం మాణిక్య రెడ్డి ఫంక్షన్ హాలులో భూభారతి చట్టం-2025పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. నూతన చట్టానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేవేళ్ళ ఆర్డిఓ చంద్రకళ చదివి వినిపించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రైతులకు, ప్రజలకు ఏవిధంగా న్యాయం జరుగుతుందని వివరించారు. ధరణి ద్వారా రైతులు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుకున్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. సదస్సులలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ధరణి స్థానంలో సరళమైన భూ భారతి పోర్టల్‌ను ఈ నెల 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజు ప్రారంభించిందన్నారు. భూమి హక్కుల భద్రతకు, భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి అమల్లోకి తెచ్చిందని అన్నారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టం గురించి రైతులకు సవివరంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించే ఈ చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే మొదటి వారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. భూ వివాదాల విషయంలో అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం సమకూరుస్తారని సూచించారు. భూసమస్యల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉంటుందని, ఈ చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులను కేటాయిస్తారని తెలిపారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెంటయ్య గౌడ్, సురేందర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి ఓ మంచి మార్పుకు శ్రీకారం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వం ఎవరి లాభం కోసం అయితే ఆలోచించి భూ భారతి చట్టం రూపొందించిందో వారినే అతిథులుగా పిలవడం, వారికి ఈ చట్టంపై అవగాహన కల్పించడమన్నది ఒక మంచి మార్పుకు శ్రీకారమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. శనివారం మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో గల సూపర్ సంగీత్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు కలెక్టరు ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో విధాలుగా ఆలోచించి ధరణిలోని సమస్యలను తొలగించి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, దీని వలన ప్రతి ఒక్కరి భూ సమస్యలకు పరిష్కారం కలుగుతుందని అన్నారు. ధరణిలో సమస్యలను, దాని వల్ల నష్టపోయిన వారికి మేలు చేయాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఎంతో కృషి చేసి ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. అనుభవం కలిగిన రిటైర్ ఉద్యోగులు, నిపుణులు ఎంతో మందితో చర్చించి ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందిందన్నారు. ధరణిలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు, హక్కులు లేకుండా, ప్రతి సమస్యకు కోర్టుకు వెళ్లవలసి ఉండేదని, ప్రతి ఒక్కరు కోర్టుకు వెళ్లలేనందున అధిక సంఖ్యలో సమస్యలు మిగిలిపోయాయని కలెక్టరు తెలిపారు. కోర్టులకు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించే విధంగా భూభారతి చట్టంలో తహసీల్దారు స్థాయి నుండి సిసిఎల్ఎ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే వెసలుబాటు కల్పించడం జరిగిందన్నారు. ధరణిలో భూ కొనుగొలు, అమ్మకాలే కాకుండా భూరికార్డులలో పేర్ల మార్పులకు కూడా చాలా ఇబ్బంది కలిగిందని అన్నారు. భూభారతిలో ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యతులో శాటిలైట్ ఆధారంగా భూమికి సంబంధించి సర్వే చేసిన కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని, తద్వారా చాలా పకడ్బందీగా మ్యాపింగ్ ఉంటుందని కలెక్టరు తెలిపారు. ఈ భూధార్ విజయవంతమైతే భవిష్యత్తు తరాలకు ఏలాంటి భూ ఆక్రమణ సమస్యలు ఉండబోవన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేస్తామని కలెక్టరు అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు, మూడుచింతలపల్లి తహసీల్దారు నర్సింహారెడ్డి,రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద చట్ట సవరణను సమీక్షించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల న్యాయవాద చట్టం 1961 మార్పులు చేస్తూ కొత్త చట్టాన్ని 2025 రూపొందించడం న్యాయవాదుల వృత్తి ప్రమాదకరంలో పడుతుందని ఎఐఎల్‌యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.పార్థసారథి అందోళన వ్యక్తం చేశారు. అమెండ్మెంట్ బిల్లును ఆల్ ఇండియా లాయర్స్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని అయన పేర్కొన్నారు. శనివారం మామిడి వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ ప్రతిపాదించిన సవరణ బిల్లులో బార్ కౌన్సిల్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. వెంటనే అమెండ్మెంట్ బిల్లును రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. 2019 తర్వాత బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో ఎన్రోల్ చేసుకున్న అడ్వకేట్ లందరికీ హెల్త్ కార్డులను ఇవ్వాలన్నారు. న్యాయవ్యవస్థలో పనిచేస్తున్న ఉన్నత పదవుల్లో ఉన్న జడ్జిలు ఇండ్లలో డబ్బులు సంచులు దొరకడం అవమానకరమని ఆ విధంగా దొరికిన వారిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐదు జిల్లా ఉపాధ్యక్షులు కుక్కదువ్వ సోమయ్య, తడక మోహన్, సహాయ కార్యదర్శి బొల్లెపల్లి కుమార్, కోశాధికారి బొడ్డు కిషన్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి నేహాల్ యాదసు యాదయ్య, జేల్లా రమేష్, ఎండి ఖయ్యూం, గాదపాక శంకర్, ఆకుల మల్లేశం, పిడుగు ఐలయ్య, జిట్టా భాస్కర్ రెడ్డి, ఎస్ కే హమీద్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రపురి అవినీతిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : చిత్రపురి అవినీతి పై సినిమా రంగం కార్మికులు తిరుగు బాటు భావుట ఎగురవేశారు. శనివారం నాడు ఇందిరాపార్క్ వద్ద వున్న ధర్నా చౌక్‌లో వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సినిమా కార్మికులకు అన్యాయం చేస్తూ కొంత మంది అక్రమ చిత్రపురి కమిటీ దగ్గర లబ్ధి పొందారని వారు ఆరోపించారు. ఈ కమిటీని రక్షిస్తున్న తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావును వెంటనే సస్పెండ్ చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే చిత్రపురి అక్రమార్కుడు అయినా వల్లభనేని అనిల్ కుమార్‌కి వత్తాసు పలుకుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ ఈ విషయంపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంల దృష్టికి తీసుకెళ్ళి దీనిపై ఉభయ సభల్లో ప్రస్తావించేలా చూస్తామన్నారు. న్యాయం జరిగే వరకు ఏఐటీయూసి మీకు మద్దతుగా పోరాటం చేస్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించి తక్షణమే ఈ కమిటీని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్, ఆమ్ ఆద్మీ నాయకులు దిడ్డి సుధాకర్, నవోదయం పార్టీ నాయకులు పటేల్, భద్ర, కస్తూరి శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - కాప్రా : మోడి బిల్డర్స్ నిర్మించినన గుల్ మెహర్ రెసిడెన్సీలో కనీస వసతులు లేవంటూ అపార్టుమెంటు వాసులు శనివారం ధర్నా నిర్వహించారు. సకల వసతులంటూ తమను మోసం చేశారని కాప్రా సర్కిల్ పరిధిలోని గుల్ మెహర్ రెసిడెన్సీ వాసులు ఆందోళన బాట పట్టారు. నెలల తరబడి సరైన వసతులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నా బిల్డర్స్ పట్టించుకోవటం లేదని గుల్ మెహర్ రెసిడెన్సీ వాసులు గేటు ఎదుట ప్లాకార్డులు చేత పట్టి ధర్నానిర్వహించారు. గెటెడ్ కమ్యూనిటీ, అన్ని హంగులంటూ ఆర్భటపు ప్రకటనలు చూసి ఇక్కడ ఫ్లాట్లు కొనుగోలు చేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే ఉందని బాధితులు వాపోతున్నారు. మొత్తం 8 బ్లాకులకు కలిసి 7 బోర్లున్నాయనీ, మంజీరా వాటర్, పార్కింగ్ సౌకర్యాలు, లిఫ్టు వసతి కల్పిస్తామని చెప్పిన బిల్డర్ కేవలం ఒకే బోరుతో అన్ని బ్లాకులకు చాలీచాలని నీటి సరఫరా చేస్తున్నారన్నారు. విద్యుత్, పార్కింగ్ సమస్యలతో సతమతమౌతున్నామని చెబుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే బెధిరింపులకు పాల్పడుతూ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని వాపోతున్నారు. ఎన్నో ఆశలతో సొంతింటి కళ నెరవేర్చుకున్నామనే ఆనందం లేకుండా పోతుందని, రిటైర్మెంట్‌తో వచ్చిన డబ్బులతో ఇక్కడ ఫ్లాటు కొనుగొలు చేసి ఇబ్బందులకు పడుతున్నామంటున్నారు. పార్కింగ్ స్థలంలో డ్రైనేజీ, వర్షం నీరు నిలవడం, తరచూ విద్యుత్ సమస్యలు, లిఫ్టు ఎప్పుడు పనిచేస్తుందో తెలియని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీటి సరఫరాతో అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. పనిచేయని సీసీ కెమెరాలు, లిఫ్టులు, సెక్యూరిటీ కేవలం అలంకార ప్రాయంగానే మారాయన్నారు. అధికారులు స్పందించి తమకు సరైన వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఫ్లాటు యజమానులు కోరుతున్నారు. 8 బ్లాకుల్లో 340 ఫ్లాట్లు ఉండగా ప్రస్తుతం 225 ఫ్లాట్లలో యజమానులు నానా ఇక్కట్లకు గురవుతున్నట్లు బాధితులు చెబుతున్నారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : సమాజంలో పరిశోధనలు ఎంతో ముఖ్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. అంతేకాకుండా సమాజా నికి ఉపయోగపడే విధంగా ఉండాలని కూడా సూచించారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో రిసెర్చ్ సూపర్వైజర్ డాక్టర్ బోయిని రాజేందర్రెడ్డి అధ్వర్యంలో అడ్డగట్ల నాగరాజు ఇంజనీరింగ్ విభాగంలో ట్రాన్స్ఫార్మర్ లెస్ సింగల్ ఫేస్ మల్టీలెవల్ ఇన్వెర్టర్ ఫర్ సోలార్ ఫోటోవోలటైక్ సిస్టమ్స్ విత్ వోల్టేజ్ బూస్టింగ్ ప్రాపర్టీపై పరిశోధన చేయగా డాక్టరేట్ సాధించాడు. నాగరాజును సాత్వికరెడ్డి శనివారం అభినందించి డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా సమాజంలో పరిశోధనలు ఎంతో అవసరమని వాటి ద్వారానే ప్రజలు ప్రభావితమవుతారని తద్వారా సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనలు చేయడం భారతదేశానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు తీసుకురావచ్చు అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శంకర్‌ంగం. ప్రొఫెసర్ క్రిష్టోపర్, డీన్ రాజు, రాజేందర్రెడ్డి, జగదీశ్వర్, పీఆర్ఓ గాదె రాంబాబు పాల్గొన్నారు.

తెలంగాణాలో యూలర్ నెట్‌వర్క్ విస్తరణ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : భారత్‌లో 36వ ప్రగతి కమర్షియల్స్‌తో భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఈవీ దత్తతను బలోపేతం హైదరాబాద్, దేశంలో ప్రముఖ ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల తయారీదారు అయిన యూలర్ మోటార్స్, తెలంగాణలో తమ తొలి డీలర్‌షిప్‌ను ప్రారంభించడం ద్వారా తమ ఉనికిని మరింతగా బలపర్చింది. ప్రగతి కమర్షియల్స్‌తో భాగస్వామ్యంలో ఉప్పల్‌లో ఈ కొత్త డీలర్ షిప్పు ప్రారంభించిన సందర్భంగా సంస్థ సేల్స్, మొబిలిటీ వైస్ ప్రెసిడెంట్ వాణి రిఫీ మెహ్రా మాట్లాడుతూ ఇది దక్షిణ భారతదేశంలోని వేగవంతమైన అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో యూలెర్ మోటార్స్ నిరంతర పెట్టుబడులకు సంకేతంగా ఉంది అని అన్నారు. హైదరాబాద్ తన విస్తరిస్తున్న లాజిస్టిక్స్ కారిడార్లు, పరిశ్రమల సముదాయాలు, స్థిరమైన లాస్ట్ మైల్ డెలివరీకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా యూలెర్ మోటార్స్ ఒక కీలక వ్యూహాత్మక మార్కెట్‌గా ఉంది. ఈ కొత్త డీలర్‌షిప్ కూకట్‌పల్లి, బాలానగర్, సమీప రవాణా కేంద్రాలు వంటి అధిక డిమాండ్ జోన్లకు సేవలందించేందుకు అనుకూలంగా ఉందన్నారు. ఈ డీలర్‌షిప్, యూలెర్ మోటార్స్ ప్రధాన వాణిజ్య ఈవీలైన హైలోడ్ ఇవి స్టార్మ్ ఈవి అమ్మకాలను చేస్తుందన్నారు.

సీఎంను పదవి నుండి దిగిపోమనడానికి మీరెవరు...

విశాలాంధ్ర - హైదరాబాద్ : చీటికి మాటికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తానేదో సీఎంగా రేవంత్‌రెడ్డికి అవకాశం ఇచ్చినట్లు ఫీలవుతూ సీఎం పదవి నుండి రేవంత్‌రెడ్డిని దిగిపో దిగిపో అంటున్నారని ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మండిపడ్డారు. అసలు రేవంత్‌రెడ్డిని పదవి నుండి దిగిపోమని చెప్పే అధికారం కేటీఆర్‌కు ఎక్కడిదని నిలదీశారు. అయనకు ప్రజలు అవకాశంతో అధికారంలోకి వచ్చారు తప్ప బీఆర్ఎస్ దయతోనో లేదా ఆ పార్టీ ఎమ్మెల్యేల మద్దతుతోనో అధికారంలోకి రాలేదనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అరాచకాలు, దుర్మార్గలు, మీ కుటుంబ పాలన భరించలేక ప్రజలు మిమ్మల్ని అధికారంలోకి నుండి దింపేశారని అన్నారు. మరో 20 ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, రేవంత్ రెడ్డి కాలి గోటికి కేటీఆర్ సరిపోడంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. కేటీఆర్‌కు ప్రస్తుతం అయన చెల్లి కవిత, బావ హరీష్‌రావులతో వుందని బీఆర్ఎస్ పార్టీకి ఎప్పటికైనా హరీష్ రావు అధ్యక్షుడు అవుతాడని కేటీఆర్‌కి భయం పట్టుకుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఎప్పుడు ప్రజల కోసమే ఆలోచన చేస్తూ పని చేస్తున్నారని, ఎనుముల రేవంత్ రెడ్డి అనే పేరు బీఆర్ఎస్ నాయకులకు చాలా ఏండ్లు యది ఉంటుందన్నారు. తండ్రి దిగిపోగానే కొడుకు ఎక్కడానికి ఇది కారుణ్య నియామకం కాదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయంలో రైతులను మోసం చేసినప్పుడు, పేపర్ లికేజి, విద్యార్థులు చనిపోయినప్పుడు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వనప్పుడే, దళితుడిని సిఎం చేయనప్పుడే కేసీఆర్‌ని దిగిపోమని కేటీఆర్ చెప్పాల్సిందని, మీది కల్వకుంట్ల కుటుంబం కాదు కల్వ కుట్రల కుటుంబం అంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్ ముందు నీ ముల్కి (స్టడీ సర్టిఫికెట్స్) తీసుకొని రా అప్పుడు నువ్వు తెలంగాణ వాసివో కాదో చూద్దామని సవాల్ విసిరారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టిందని ఆయన ధ్వజమెత్తారు.జర్నలిస్టుల సమస్యల విషయంలో పాలకులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. పదేళ్ల పాలనలో జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శనివారం టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం తృతీయ మహాసభ సూరారంలోని వీఐపీ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు గడ్డమీది అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్‌గా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నెంబర్ వన్ యూనియన్‌గా బలపడిందని, రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ పాలకుల పక్షం కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌కే సలీమా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కరించాల్సివుందన్నారు. ఈ మహాసభలో ఫెడరేషన్ సీనియర్ నాయకుడు దామెర జగదీశ్వర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి శంకర్, కోశాధికారి గోవిందరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ టీబీజేఏ కన్వీనర్‌గా రాజేష్, కో-కన్వీనర్లుగా కోటేశ్వరరావు, దుర్గారావు, శ్రీనివాస్, సత్య, సత్యం తదితరులు ఎన్నికయ్యారు.

కేసుల నుండి తప్పించుకునేందుకు బీజేపీతో ఒప్పందం

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదేళ్ళ పాటు అధికారంలో వున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొంగల ముఠాలా రాష్ట్రాన్ని దోచుకున్నారని ఇపుడు ఆ అవినీతి కేసుల నుండి భయటపడేందుకు బీజేపీతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నారని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ గౌడ్ స్పందిస్తూ పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేసిన మీరు, మీ అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకోకుండా నరేంద్ర మోదీకి దాసోహమయ్యారని ఆరోపించారు. మీ బలహీనతలను ఆసరాగా తీసుకున్న బీజేపీ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. సొంత ప్రయోజనాలకే పెద్ద పీట వేసిన మీరు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిరదన్నారు. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవేశ పెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చింది మీరు కాదా కేటీఆర్ అంటూ విరుచుకుపడ్డారు. పదేళ్లలో మోదీ తీసుకున్న అనాలోచన నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన మీరు ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదంగా వుందన్నారు. కవితని లిక్కర్ స్కాం నుంచి కాపాడడానికి బీజేపీకి ఊడిగం చేసింది నిజం కాదా అని నిలదీశారు. బీజేపీకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారని, బీజేపీ పై బీఆర్ఎస్ ప్రేమతోనే హెచ్‌సీయూ పై రెండు పార్టీ నేతల దుష్ప్రచారం చేస్తున్నాయని ద్వజమెత్తారు. పదిహేను నెలల స్వల్ప కాలంలో రికార్డు స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యోగాలివ్వడం, రైతు, మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, బీసీలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడం, ఎస్సీ వర్గీకరణ చేయడం, పేదలకు సన్న బియ్యం అందించడం వంటి గొప్ప పనులను రేవంత్ రెడ్డి సర్కార్ చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మీ అజ్ఞానానికి నిదర్శనం అంటూ చెపుకొచ్చారు. అనంతరం గాంధీభవన్‌లో తెలంగాణ క్యాబ్ డ్రైవర్లు వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ని కలిసి పలు కోరికలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్నా ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్, కౌకూర్ ప్రాంతాల్లో క్రైస్తవ యువతీ యువకులు భారీగా నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో మల్కాజిగిర శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లియోనార్డ్, నవీన్ చీటియా, అనిల్ కిషోర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, సాలొమన్, మైకేల్, అరుణ్, సోమశేఖర్, ఆనంద్, దినకర్ తదితరులు పాల్గన్నారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విశాలాంధ్ర-దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని బిజెపి దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మ డబల్ బెడ్రూమ్‌ల నందు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌కి మాజీ కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి నూతన బోర్ల కొరకై గత జనవరిలో ఇచ్చిన అభ్యర్థన మేరకు నూతనంగా 3 బోర్లను మంజూరు చేయించారు.అందులో భాగంగా శనివారం గండి మైసమ్మ డబల్ బెడ్ రూమ్ కాలనీలో 10 లక్షల నిధులతో 3 బోర్లు పంపు సెట్ మంజూరు కావడంతో కాలనీ వాసులతో కలిసి బిజెపి దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు కృష్ణారెడ్డి కృషి వల్లనే నెలకొన్న మంచి నీటి సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇండ్లు వచ్చాయన్న ఆనందం తప్ప ఇక్కడ పరిష్కరించవలసిన సమస్యలు చాలా ఉన్నాయని వాపోయారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపమని కోరారు.అనంతరం కాలనీవాసులు పిసరి కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్ యాదవ్, గోనె మల్లారెడ్డి, ఎంబరి ఆంజనేయులు, ప్రభాకర్ రెడ్డి, రోజా, జీ మోహన్ రెడ్డి, అతీష్ బాబు, తలారి బాలు,గణేష్ అలిమేలు, నాగమణి తదితరులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తనిఖీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులపై వివరణాత్మక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ ఇతర సీనియర్ రైల్వే అధికారులు కూడా ఉన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులపై ఆయన వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా (అంటే ప్లాట్‌ఫామ్ నంబర్ 1, నంబర్ 10 వైపు) పునరభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ప్లాట్‌ఫారమ్‌ల విస్తరణ పనులను సులభతరం చేయడానికి కొన్ని ప్లాట్‌ఫారమ్‌లను తాత్కాలికంగా మూసి వేసినందున ట్రాఫిక్ రద్దీని నివారించడానికి అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను, అత్యున్నత ప్రమాణాల భద్రతను కొనసాగిస్తూ ప్రయాణికుల సజావుగా రాకపోకలను నిర్ధారించడానికి సికింద్రాబాద్ డివిజన్ అధికారులు చేపట్టిన సమగ్ర చర్యలను జనరల్ మేనేజర్ వివరణాత్మకంగా సమీక్షించారు. మౌలిక సదుపాయాల మార్పులతో కూడిన పునరాభివృద్ధి పనుల దృష్ట్యా సమర్థవంతమైన జనసమూహ నిర్వహణ, భద్రతా వ్యవస్థలో మెరుగుదల అవసరమని ఆయన అధికారులను ఆదేశించారు.

సెట్విన్ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను పర్యవేక్షించిన మాజీ మేయర్...

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెట్విన్ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ శనివారం ఉదయం పర్యవేక్షించిన బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మా రెడ్డి, కొత్త చంద్ర గౌడ్, సీసా వెంకటేష్ గౌడ్, భూక్య సుమన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నిర్మల, అనిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్ రాష్ట్ర స్థాయి కార్యకర్తల సదస్సును విజయవంతం చేయండి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: నల్గొండ టౌన్‌లో మే 3న జరిగే ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్యకార్యకర్తల సదస్సును విజయవంతం చేయాలనీ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. లిబర్టీ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆప్ నేతలు బుర్ర రాములు గౌడ్, ఎండి. మజీద్, డా. అన్సారీ, జావీద్ షరీఫ్, అద్దంకి రవీందర్, దర్శనం రమేష్, అబ్దుల్ ముఖ్తఅధిర్, అఫ్సర్ సలాం, మోమిన్, శివాజీ, కుత్బొద్దీన్, రాజమల్లయ్య, అజీమ్ బేగ్, షాబాజ్, నాగార్జున, జి.అంజన్న, ధర్మేంద్ర తివారి, కొడంగల్ శ్రీనివాస్ లాతోకలసి డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆప్ రాష్ట్ర స్థాయి ముఖ్యకార్యకర్తల సదస్సు గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆప్ పోటీ చేస్తుందని, ఈ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోలోని అన్ని జిల్లాలో ఆప్‌ను బలోపితం చేసేందుకు, పార్టీ పునర్నిర్మాణం, తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగే సంపూర్ణ రాజకీయ వాతావరణం సృష్టించేందుకు ఈ సదస్సులో చేర్చిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు ఆప్ తెలంగాణ రాష్ట్ర బాద్యులు, మాజీ ఎమ్మెల్యే దిలీప్ పాండే హాజరవుతున్నారని, ప్రతి ఆమ్ క్రియాశీల కార్యకర్త ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలనీ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు.

గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ఇన్చార్జి తోటపల్లి శంకర్ అన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప నాయక్ జిల్లా అధ్యక్షులు శ్యామలత అధ్యక్షతన మహాసభ కరపత్రం శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతూ గిరిజన హక్కుల కోసం గిరిజన అభివృద్ధి కోసం నిరంతరం తెలంగాణ గిరిజన సమాఖ్య అలుపెరుగని పోరాటం నిర్వహిస్తుందని మేడ్చల్ జిల్లా గిరిజన సమైక్య ఆధ్వర్యంలో గిరిజన సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించామని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్మించు కొనేందుకు గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలు ఏప్రిల్ 25 వ తేదీన జవహార్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ గిరి ప్రసాద్ నగర్‌లో నిర్వహిస్తున్నామని జిల్లాలో ఉన్న గిరిజనులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి మోతే రాజేశ్వరి, పి పద్మమ్మ, లావణ్య, రేణుక, అమృతమ్మ, దోసకాయల సత్తెమ్మ, శ్రీ లక్ష్మీ, బి లక్ష్మి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో రెసోనెన్స్ చారిత్రాత్మక విజయం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఆల్ ఇండియా జేఈఈ మెయిన్ 2025లో హైదరాబాద్‌లోని రెసోనెన్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు చారిత్రాత్మక విజయం సాధించారు. మాదాపూర్‌లో గల రెసోనెన్స్ స్కూల్ విజ్డమ్ క్యాంపస్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో అద్భుత విజయం సాధించడం రెసోనెన్స్ ప్రతిభ మరోసారి నిరూపితమైందన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, ఇతర మెడికల్ ప్రవేశ పరీక్షల్లో అగ్రశ్రేణి ర్యాంకులు సాధించడంలో ముందంజలో ఉన్నామన్నారు. రెసోనెన్స్ విద్యార్థి అర్చిస్మాన్ 295/300 స్కోర్ చేయడంతో ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా ర్యాంక్ 13 వచ్చిందన్నారు. హైదరాబాద్ రెసోనెన్స్ జూనియర్ కళాశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సెంటైల్ సాధించారన్నారు. 57 మంది విద్యార్థులు 99 పర్సెంటైల్ పైగా మార్కులు సాధించారన్నారు. మొత్తం 285 మంది విద్యార్థులు విభిన్న సబ్జెక్టుల్లో 99 పర్సెంటైల్ పైగా వచ్చాయన్నారు. రెసోనెన్స్ హైదరాబాద్ విద్యార్థులు ఈ సంవత్సరం జేఈఈ మెయిన్ పరీక్షల్లో దేశవ్యాప్తంగా అసాధారణ విజయాలు సాధించారన్నారు. హైదరాబాద్‌లోని అన్ని క్యాంపస్ల నుంచి 1500 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొందారన్నారు. అందులో 57 మంది విద్యార్థులు 99 శాతం పైగా సాధించారని చెప్పడం గర్వంగా ఉందన్నారు. ఇది మా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషికి నిదర్శనమన్నారు. టాప్ 4 విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల స్కాలర్‌షిప్ ఇవ్వడం జరిగిందన్నారు. హైదరాబాద్ క్యాంపస్ల నుంచి పల్లా శివ సంకేత్ రెడ్డి, పీ వెన్నెల, పీ దివిత్ రెడ్డి వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సెంటైల్ సాధించారన్నారు.

వామపక్షాల విలీనం అవశ్యం

- దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసం
- రాఘవాచారి సంపాదకీయాలు సమకాలీన పరిస్థితులకు దర్పణం
- నాల్గవ సంపుటి ఆవిష్కరించిన నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వామపక్షాల ఐక్యత కాదు... విలీనం కావాల్సిన అవసరం ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అభిప్రాయపడ్డారు. అక్షర శస్త్రధారి చక్రవర్తుల రాఘవాచారి జాతీయ అంశాలతో కూడిన సంపాదకీయాల నాల్గవ సంపుటి పుస్తకావిష్కరణ సభ విజయ వాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సి.రాఘవా చారి ట్రస్ట్ అధ్వర్యంలో శనివారం నిర్వహిం చారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన నారాయణ మాట్లాడుతూ అనేక విషయాలపై అవగాహన గల విజ్ఞాన ఖని రాఘవాచారి అని కొనియా డారు. సమకాలీన రాజకీయాలు, పరిస్థితు లకు రాఘవాచారి సంపాదకీయాలు సాక్ష్యాలుగా నిలుస్తాయన్నారు. సంపాద కీయం రాయడం అంత సులువు కాదని అన్నారు. పత్రికల్లో ముందుగా ఎక్కువ మంది సంపాదకీయాలు చదువుతారని అన్నారు. సంపాదకీయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. రాఘవాచారి రాజకీయ నాయకుడు కాదు కానీ... రాజకీయ నాయకులకే గురువు లాంటి వారని అభివర్ణించారు. నాడు ఆయన కంటే సీనియర్ సంపాదకులైన పొత్తూరి స్వయంగా రాఘవాచారిని ఓ సభలో ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. వరుసగా రాఘవాచారి సంపాదకీయాలను సంపుటిలుగా పుస్తకాలు తీసుకుస్తున్న రాఘవాచారి ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను పాలకులు భ్రష్టు పట్టిస్తున్నారని నారాయణ విమర్శించారు. తమిళనాడు గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాలను గుర్తు చేశారు. రాష్ట్రపతిని రబ్బర్ స్టాంప్‌గా మార్చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో ప్రభుత్వాలకు అనుకూల తీర్పులు ఇచ్చిన వారికి రాజ్యసభ సభ్యత్వాలు, గవర్నర్ పోస్టులు ఇవ్వడాన్ని చూస్తున్నామన్నారు. రాజకీయాల్లో విలువలు కనుమరుగవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును ఉపరాష్ట్రపతి తప్పుబట్టడమంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని అన్నారు. అదే ప్రతిపక్షాలు గానీ, వామపక్షాలు గానీ అలా మాట్లాడితే దేశద్రోహులు అంటూ కేసులు నమోదు చేస్తారన్నారు. వ్యవస్థలకు, ప్రభుత్వానికి మధ్య ఉండాల్సిన లక్ష్మణ రేఖ ఎగిరిపోయిందన్నారు. సీబీఐ, ఈడీ, నీతి ఆయోగ్ తదితర స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలు ప్రధాని మోదీ గుప్పిట్లో ఉండిపోయాయని, రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతింటోందని అన్నారు. దేశంలో ఒకటి, రెండు శాతం ఉన్న ప్రజానీకానికి సైతం సమానహక్కులు ఉండాలని రాజ్యాంగంలో అంబేద్కర్ రాశారన్నారు. ప్రస్తుత పాలకుల ఫాసిస్టు ధోరణిల కారణంగా భారతదేశం చీలిపోయే పరిస్థితి వస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వారే... ధ్వంసం చేస్తున్నారని, భవిష్యత్తులో ఉత్తర, దక్షిణ భారతదేశం అంటూ విభజనవాదం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోదీ పరపతి తగ్గిపోతోందని, అందుకే మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు రకరకాల పద్ధతులు అవలంబిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో బలమైన ప్రతిపక్షం ఉండాలని, అందువల్ల వామపక్షాల ఐక్యత కాకుండా సీపీఐ, సీపీఎం కలవాల్సిన సమయం ఆసన్నమైందని నారాయణ అన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాఘవాచారితో స్నేహం చేస్తే వదులుకోలేరని అన్నారు. పార్టీలో తన ఎదుగుదల సమయంలోనే ఆయన విశాలాంధ్ర ఎడిటర్‌గా వచ్చారన్నారు. ఎంతపెద్ద విషయాన్నైనా సులభంగా చెప్పే తత్వం రాఘవాచారిదని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన గల వారు చాలా అరుదుగా ఉంటారని అన్నారు. ప్రత్యర్థులు కూడా ఆయనను గౌరవిస్తారన్నారు. రాఘవాచారి రాసిన సంపాదకీయాలకు కాలానుగుణ్యత ఉందన్నారు. యూనివర్సిటీల్లో కులతత్వం, అంగట్లో చదువుల తల్లి వేలం, రాజకీయ రంగంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంటి సంపాదకీయాలు నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉన్నాయని, వాటిని మళ్లీ అచ్చువేసి చదువుకోవచ్చని అన్నారు. కేంద్రంలోని బీజేపీ 2014 ఎన్నికల్లో చెప్పిన ఏ హామీ అమలు చేయకపోగా పూర్తిగా ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యం బతకాలంటే సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని, భేషజాలను పక్కన పెట్టి వామపక్షాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. గల్లీ నుండి ఢిల్లీ వరకూ ఐక్యత గళం వినిపించాలని, తద్వారా పైస్థాయిలో చర్చలు జరగాలన్నారు.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తను రాఘవాచారి వద్ద శిష్యరికం చేశానన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు ఆయన గొప్పతనాన్ని, వ్యక్తిత్వాన్ని, మేథోసంపత్తిని ప్రశంసించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ గొప్ప ప్రజ్ఞాశాలి రాఘవాచారి అని కొనియాడారు. ఆయన సంపాదకీయాలు రిఫరెన్స్‌గా ఉపయోగపడతాయన్నారు. అనేక అంశాలపై ఆయన రాసిన సంపాదకీయాలను నేటితరం సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ విశాలాంధ్రకు రాఘవాచారిని కిరీటంగా అభివర్ణించారు. ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ఆరోగ్యం సహకరించకపోయినా రాఘవాచారిపై ఉన్న గౌరవంతో కార్యాక్రమానికి హాజరైనట్లు తెలిపారు. ముందుగా దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ సంపుటిని పరిచయం చేశారు. లోతైన విశ్లేషణ, ముందు చూపుతో రాఘవాచారి సంపాదకీయాలు రాశారని, ఆయనకు అన్ని రంగాల్లో ప్రవేశం ఉందన్నారు. పుస్తకం తీరు తెన్నులను వివరించారు. రాఘవాచారి సంపాదకీయాల క్యూఆర్ కోడ్‌ను విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు ఆవిష్కరించారు. అతిథులకు మాలతి స్వాగతం పలకగా... సభకు ట్రస్ట్ సభ్యుడు బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించారు. వామపక్షాల ఐక్యతపై ట్రస్ట్ అధ్వర్యంలో సెమినార్‌లు నిర్వహిస్తామని జమిందార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజయ్, సీపీఐ ఎన్టీఆర్, విజయవాడ నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, డాక్టర్ సురేశ్, రాఘవాచారి సతీమణి, ట్రస్ట్ చైర్మన్ కనపర్తి జోత్స్న, కుమార్తె డాక్టర్ అనుపమ ప్రసంగించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రనాయక్, పిచ్చయ్య, నజీర్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

పోలవరం... పట్టిసీమ సందర్శించిన మహారాష్ట్ర అధికారులు

విశాలాంధ్ర-పోలవరం: మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు శనివారం పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. మహారాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి సంజయ్ బెల్సారే, గోదావరి నది నిర్వహణ ఔరంగాబాద్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ తీర్మన్వర్, జలవనరుల విభాగం పుణె చీఫ్ ఇంజనీర్ హనుమంత్ గుణాలే, సీడీఓ నాసిక్ విభాగం చీఫ్ ఇంజనీర్ ఆశీష్ డియోగడే ఈ బృందంలో ఉన్నారు. పోలవరం ప్రాజెక్టులో స్పిల్ వే, స్పిల్ వే గేట్లు, ఫిష్ లేడర్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతం, జల విద్యుత్ కేంద్రం తదితరాలను వీరు ఆసాంతం పరిశీలించారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, దాని నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలు, మెటీరియల్ వివరాలను వారు తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టులో ఫిష్ లేడర్ ప్రత్యేకతను ఏపీ జలవనరుల శాఖ అధికారులు ప్రత్యేకంగా వివరించారు. గోదావరి నదికి వరద సమయంలో పులస చేప వరదకు ఎదురీదుతూ వస్తుందని, ప్రత్యేకంగా ఆ చేపల కోసమే ఫిష్ లేడర్ నిర్మించామని, దేశంలో మరెక్కడా ఇలాంటి నిర్మాణం లేదని తెలిపారు. అనంతరం మహారాష్ట్ర అధికారులు పట్టిసీమ ఎత్తిపోతల పథకం సందర్శించారు. అక్కడ పంప్ హౌస్, ఫోర్ బే ను పరిశీలించారు. గోదావరి నదికి వరద వచ్చే సమయంలో ఆ నీటిని పట్టిసీమ ద్వారా తరలించి కృష్ణా డెల్టాతో పాటు ఇతర ప్రాంతాలకు సాగు నీరు అందిస్తామని, రికార్డు సమయంలో ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించామని అధికారులు తెలిపారు. పోలవం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన మహారాష్ట్ర అధికారులను ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి శాలువా కప్పి సత్కరించారు. మహారాష్ట్ర అధికారులకు పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం గురించి సీఈ కె.నరసింహమూర్తి, ఈఈ డి.శ్రీనివాస్, ఏఈఈలు పద్మకుమార్, అనిల్ కుమార్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, డీజీఎం మురళి పమ్మి వివరించారు.

అలీకి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

హైదరాబాద్: అన్ని ప్రధాన భాషల్లో నటించిన ప్రముఖ నటుడు అలీ... నటుడిగా 1250 సినిమాలు పూర్తి చేసుకున్నారు. 16 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా అనేకమందికి సహాయం చేస్తున్నారు. అలీ నటనా ప్రతిభ, సామాజిక సేవలు గుర్తించిన కర్నాటక మీడియా జర్నలిస్ట్ యూనియన్ గీమా సంస్థతో కలిసి ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేసింది. దుబాయ్‌లోని ఫ్యూచర్ మ్యూజియంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ అవార్డు వేడుక... అక్కడ తొలిసారిగా నిర్వహించటం గమనార్హం. ఈ కార్యక్రమంలో అనేకమంది కన్నడ నటీనటులు, కళాకారులు, వ్యాపారవేత్తలకు గీమా సంస్థ వివిధ అవార్డులు ప్రదానం చేసింది. తెలుగు పరిశ్రమ నుండి అలీ ఒక్కరే ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ 'తెలుగు ఇండస్ట్రీ నుండి నన్ను ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇలాంటి అవార్డులు మాకు ప్రోత్సాహాన్ని అందించి, మరిన్ని మంచి సినిమాలు చేయడానికి, నలుగురికి సహాయం చేయడానికి ప్రేరణనిస్తాయి. నన్ను ఈ అవార్డుకు ఎంపిక చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు. ఈ వేడుకలో దుబాయ్‌కు చెందిన అనేకమంది అధికార ప్రతినిధులు, షేక్‌లు పాల్గొన్నారు.

ఏడాదికి 200 పని దినాలు

సీపీఐ, బీకేఎంయూ డిమాండ్
తమిళనాడులో ప్రదర్శనలు

ధర్మపురి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ) కింద పని దినాలను ఏడాదికి 200 రోజులకు పెంచాలని, దినసరి కనీస వేతనం రూ.700 చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, బీకేఎంయూ డిమాండ్ చేశాయి. తమిళనాడు, ధర్మపురిలో శనివారం పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించాయి. వేలాది మంది కార్మికులు, శ్రామికులు పాల్గొన్నారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మజ్జిగ వసతి కల్పించాలని సీపీఐ, బీకేఎంయూ డిమాండ్ చేశాయి. పెరిగిన నిత్యావసరాలు, జీవన వ్యయం నేపథ్యంలో గ్రామీణ కార్మికులకు సముచిత జీవనోపాధి కల్పించేలా, వారి కనీస అవసరాలు తీర్చేలా ఉపాధి హామీ పథకం కింద కనీస వేతనాల్లో గణనీయమైన పెంపుదల కోసం డిమాండ్ చేశాయి. కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని, వాటిని పెండింగ్ పెట్టి ఇబ్బంది పెట్టవద్దని సూచించాయి.

రాష్ట్రపతిని కోర్టులు శాసించరాదా?

జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రశ్న

చెన్నై: రాష్ట్రపతికి మార్గదర్శకాలను న్యాయస్థానాలు ఎందుకు ఇవ్వరాదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రశ్నించారు. పార్లమెంటు చేసిన చట్టాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించగలిగినప్పుడు... ప్రజలకు సంబంధించి బాధ్యతాయుత పదవిలో ఉన్న వారికి కోర్టులు మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమిటని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించే బిల్లులపై సంతకాలు చేయడంలో జాప్యం లేకుండా గవర్నర్లతో పాటు రాష్ట్రపతికి సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు జారీ చేయడంపై సర్వత్రా ఆసక్తికరమైన చర్చ జరుగుతున్న క్రమంలో జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. 'పార్లమెంటు లేక శాసనసభలు చేసే చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు, హైకోర్టుల జడ్జిలు తేల్చగలిగినప్పుడు.. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న రాష్ట్రపతి, గవర్నర్లకు విధులు బాధ్యతగా నిర్వర్తించాలని గుర్తుచేయడమే కాక తగు మార్గదర్శకాలు ఎందుకు ఇవ్వకూడదు? జడ్జిలుగా మీకు... నాకు... పార్లమెంటు చేసే చట్టాలను ధిక్కరించే అధికారం ఉన్నప్పుడు. రాష్ట్రపతిని ఆదేశించే అధికారం ఉండదని అనుకోను' అని వ్యాఖ్యానించారు. సీనియర్ న్యాయవాది, డీఎంకే రాజ్యసభ సభ్యుడు ఎన్‌ఆర్ ఎలాంగో కుమారుడు రాకేశ్ రంగనాథన్ 24వ జయంతి సందర్భంగా శనివారం చెన్నైలో రోజా ముతయ్య రీసెర్చ్ లైబ్రరీ (ఆర్ఎంఆర్ఎల్)- రాకేశ్ లా ఫౌండేషన్ (ఆర్ఎల్ఎఫ్) సంయుక్త అధ్వర్యంలో 'భారత రాజ్యాంగం 75 ఏళ్ల ప్రయాణం' అంశంపై జస్టిస్ చలమేశ్వర్ స్మారకోపన్యాసం చేశారు. ఆ సమయంలో మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి సీటీ సెల్వం అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకునే సందర్భాన్ని వేడుక చేసుకోవడం కంటే ఆత్మవిమర్శ చేసుకోవడానికి వినియోగించుకోవడం సముచితమని జస్టిస్ చలమేశ్వర్ సూచించారు. 'ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం డబ్బును పిచ్చిగా ఖర్చు పెడుతారు... బడ్జెట్ కొరత వల్ల పెరిగే న్యాయ వ్యవస్థకు సంబంధించిన బకాయిని పట్టించుకోరు. ఇది ఆందోళనకు గురిచేసే అంశం' అని ఆయనన్నారు. కార్యక్రమంలో ప్రసంగించిన వారిలో మద్రాస్ హైకోర్టు జస్టిస్ జీవీ స్వామినాథన్, రిటైర్డ్ జడ్జి జీఎం అక్బర్ అలీ, కస్తూరీ అండ్ సన్స్ డైరెక్టర్ ఎన్.రవి, తమిళనాడు మంత్రి శేఖర్ బాబు, ఆర్ఎంఆర్ఎల్ డైరెక్టర్ జి.సుందర్, ఆర్ఎల్ఎఫ్ వైస్ చైర్‌పర్సన్ రగావి ఎలంగో, కోశాధికారి స్టాలిన్ అభిమన్యు, సహాయ కోశాధికారి రంజిత్ ఉన్నారు.

అది నా రక్తంలోనే ఉంది

- ఎప్పుడు నిజం పక్షాన్నే నిలుస్తా
- భయాన్ని జయించడం నెహ్రూ నేర్పారు
- సందీప్ దీక్షత్‌తో సంభాషణలో రాహుల్

న్యూఢిల్లీ: దేశానికి తొలి ప్రధాన మంత్రి, గొప్ప దార్శనికుడు జవహర్ లాల్ నెహ్రూ తనకు రాజకీయం నేర్పలేదని, భయాన్ని జయించడాన్ని, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనడాన్ని వారసత్వంగా అందించారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తెలిపారు. ఎల్లప్పుడు నిజం పక్షానే నిలవాలనేది తన రక్తంలోనే ఉందని చెప్పారు. నెహ్రూ నుంచి నిజాన్ని, ధైర్యాన్ని వారస త్వంగా పొందాను... అణచివేతను ఎదిరించడం, స్వాతంత్ర్యం కోసం దావా చేయడానికి భారతీ యుల్లో ధైర్యాన్ని ఆయనే నింపారు. ఇదే నెహ్రూ గొప్ప వారసత్వం' అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌తో రాహుల్ సరదా సంభాషణ వీడియో ఆయన 'ఎక్స్' ఖాతాతో పాటు యూట్యూబ్ ఛానల్‌లో పెట్టారు. నిజం పక్షాన్నే నిలుస్తానని సంకల్పించారు. ఈ నైజాన్ని నెహ్రూ నుంచి వారస త్వంగా పొందానని చెప్పారు. 'నిజం-ధైర్యం, నెహ్రూ నుంచి వారసత్వంగా పొందా' అన్న శీర్షికన ఈ వీడియో పోస్టు చేశారు. 'సందీప్ దీక్షిత్‌తో ప్రాడ్‌క్యాస్ట్ తరహా సంభాషణలో వ్యక్తిగత విష యాలు చెప్పా. నిజం పక్షాన్నే నిల్చే తత్వం... నెహ్రూ స్ఫూర్తి, వారసత్వం గురించి మాట్లాడా. నెహ్రూ రాజకీయ నాయకుడు మాత్రమే కాదు గొప్ప దార్శనికుడు, మేధావి. ప్రమాదాలను చిరునవ్వుతో ఎదుర్కొనే శక్తిమంతుడు' అని రాహుల్ వర్ణించారు. నెహ్రూ గురించి తన నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నుంచి కథలుగా విన్నట్లు తెలిపారు. నెహ్రూ ఓ సారి తనకు ఎంతో ఇష్టమైన మంచు కొండ వద్ద పడిపోయేవారని... కుటుంబ సభ్యులుగా పెంపుడు జంతువులు ఉండేవని, ఎప్పుడూ వ్యాయామాన్ని వదలేవారు కాదని నానమ్మ చెప్పేవారని రాహుల్ గుర్తుచేసుకున్నారు. తన తల్లి సోనియా గాంధీ ఇప్పటికీ తమ పెరట్లోని పిచుకులను చూసి ఆనందిస్తారని చెప్పారు. 'నేను జూడో చేస్తా. హాబీ కాదు... నా వ్యక్తిత్వానికి అద్దంపట్టే అంశాలివి' అని రాహుల్ అన్నారు. భయంతో సావాసాన్ని గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్, బోస్ మనకు నేర్పారన్నారు. 'సోషలిజం, రాజకీయాలు కాదు సాహసమే మన ఆయుధం. సత్యమే అస్త్రం' అని నొక్కిచెప్పారు. అహింసకు కట్టుబడితే సత్యమే మీ ఆయుధమవుతుందని, అది మీకు విజయాన్ని అందిస్తుందని గాంధీ బోధించారనిన్నారు. ఎలాంటి సవాళ్ల ఎదురైనా... ఎన్ని కష్టాలు వచ్చిన వెనుకడుగు వేయలేదు కాబట్టే వీరు మహా నాయకులు అయ్యారని రాహుల్ గాంధీ అన్నారు.

యాత్రికులకు కేంద్రం 'సైబర్' అలర్ట్

న్యూఢిల్లీ: ఛార్‌దామ్ యాత్రికులు, ఇతర పర్యటకులే లక్ష్యంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ పేర్కొంది. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించడం, సోషల్ మీడియా ప్రొఫైళ్లు, వాట్సప్ ఖాతాల నుంచి సందేశాలు పంపుతూ యాత్రికులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు వెల్లడించింది. ముఖ్యంగా కేదార్‌నాథ్ యాత్రికులకు హెలికాప్టర్ బుకింగ్‌లు, ఛార్‌దామ్ యాత్రికులకు అతిథి గృహాలు, హోటల్ బుకింగ్‌లు, ఆన్‌లైన్ క్యాబ్, ట్యాక్సీ బుకింగ్, హాలిడే ప్యాకేజీల పేరిట మోసాలు జరుగుతున్నాయని సైబర్ క్రైమ్ విభాగం పేర్కొంది. 'స్పాన్సర్డ్' పేరుతో ఉండే లింకులు, ఫేస్‌బుక్, వాట్సప్‌లో వచ్చే లింకులను క్లిక్ చేసే ముందు వాటిని ధ్రువీకరించుకోవాలని సూచించింది. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు లేదా నమ్మదగిన ప్రైవేటు ఏజెన్సీలను ఆశ్రయించాలని సూచించింది. ఇలాంటి ఘటనల గురించి తెలిస్తే వెంటనే 'సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్' పోర్టల్ లేదా 1930 నంబరుకు ఫోన్ చేసి రిపోర్టు చేయాలని సూచనలు చేసింది. తమవంతుగా గూగుల్, వాట్సప్, ఫేస్‌బుక్‌తో సమన్వయం చేసుకొని చర్యలు చేపడుతున్నట్లు కేంద్రం వెల్లడించింది.

రమన్‌కారి పంచాయతీ ఉప సర్పంచ్‌గా సీపీఐ అభ్యర్థి రమ్యమోల్ సంజీవ్

అలప్పుజా: కేరళ, అలప్పుజాలోని రమన్‌కారి పంచాయతీ ఉప సర్పంచ్‌గా సీపీఐ అభ్యర్థి రమ్యమోల్ సంజీవ్ ఎన్నికయ్యారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 13కుగాను ఏడు ఓట్లను సంజీవ్ సొంతం చేసుకున్నారు. కాగా, ప్రత్యర్థి, సీపీఎం నేత మోల్జి రాకేశ్‌కు ఐదు ఓట్లు రాగా, ఒక ఓటు చెల్లదని అధికారులు తెలిపారు. రమ్యమోల్ సంజీవ్ ఎన్నికను ప్రకటించారు. యూడీఎఫ్ సభ్యులు షీనా రాజప్పన్ రాజీనామాతో ఈ ఎన్నిక జరిగింది. అయితే యూడీఎఫ్ తమ అభ్యర్థిని నిలబెట్టలేదు. సీపీఐ అభ్యర్థికి వ్యూహాత్మకంగా బాహ్య మద్దతిచ్చింది.

బీజేడీ అధ్యక్షుడిగా మళ్లీ నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరుసగా తొమ్మిదవసారి బీజేడీకి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బీజేడీ కార్యాలయంలో శంఖ భవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో నవీన్ పట్నాయక్‌ను అధ్యక్షుడిగా ఆ పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీకే దేబ్ ప్రకటించారు. అనంతరం నవీన్ పట్నాయక్ పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ బీజేపీ తప్పుడు కథనాలను బయటపెట్టాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీకి ఎక్కువ ఓట్లు వచ్చినప్పటికీ... స్వల్ప తేడాతో ఓడిపోయాం. బీజేపీ తప్పుడు కథనాలను సమర్థంగా ఎదుర్కొనలేకపోవడమే పార్టీ ఓటమికి కారణం. మళ్లీ అలా జరగ డానికి వీల్లేకుండా బీజేపీ అవాస్తవాలను బహిర్గతం చేయాలి. సామాజిక మాధ్య మాల్లో క్రియాశీలం కావాలి. సాంకేతికతతో ప్రజల్లోకి మరింతగా వెళ్లి... వారికి వాస్తవాలను తెలియజేయాలి' అని కార్యకర్తలకు నవీన్ పట్నాయక్ సూచించారు. బీజేడీ కార్యకర్తలపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. తన తండ్రి బిజు పట్నాయక్ భావజాలం బీజేడీకి మార్గదర్శక సూత్రమని నవీన్ తెలిపారు.



మార్టూరు జాతీయరహదారిపై భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

బాపట్ల: బాపట్ల జిల్లా మార్టూరు జాతీయ రహదారిపై భారీగా పేలుడు పదార్థాల నిల్వలను పోలీసులు గుర్తించారు. స్థానిక మండల స్థాయి వైసీపీ నేతకు చెందిన పరిశ్రమ గిడ్డంగిలో వాటిని నిల్వ చేసినట్లు గుర్తించిన నిఘావిభాగం అధికారులు జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు టన్నుల కొద్దీ జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆ వైసీపీ నేతకు గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. గ్రానైట్ వ్యాపారం ముసుగులో జిలెటిన్ స్టిక్స్ అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పేలుడు పదార్థాల నిల్వకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణులకు కశ్యప్ క్షమాపణ

ముంబై: బ్రాహ్మణులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకుగాను ప్రముఖ దర్శక-నిర్మాత అనురాగ్ కశ్యప్ క్షమాపణలు చెప్పారు. 'బ్రాహ్మణులపై మూత్రం విసర్జిస్తా... ఏమైనా సమస్యా?' అన్న ఆయన పోస్ట్‌పై బ్రాహ్మణ వర్గాలతో పాటు రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. కశ్యప్‌పై కేసులు నమోదయ్యాయి. కుమార్తెకు అత్యాచార బెదిరింపులు.. కుటుంబాన్ని చంపేస్తామంటూ హెచ్చరికలు వస్తుండటంతో ఈ గొడవ సద్దుమణిగేందుకుగాను ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. 'ఎవరెన్ని తిట్టినా నా పోస్ట్‌ను వెనక్కి తీసుకోను కానీ, ద్వేషం పుట్టిస్తున్న ఆ ఒక్క లైన్‌కి మాత్రం క్షమాపణ చెబుతున్నా. నా కుమార్తె, కుటుంబం, స్నేహితులు, సహోద్యోగులకు సంస్కారవంత నాయకుల నుంచి ప్రాణ హాని ఉంది. అత్యాచారం చేస్తాం...చంపేస్తాం అంటూ బెదిరింపులు వస్తుండటం వల్లే స్పందిస్తున్నా. నా కుటుంబం ఏమీ అనలేదు. ఒక్క మనువాదంలో తప్ప. మీరు ఎలాంటి బ్రాహ్మణుడో నిర్ణయించుకోండి. ఇదే నా క్షమాపణ' అని కశ్యప్ పేర్కొన్నారు. విమర్శిస్తే బాధలేదు కానీ కుటుంబాన్ని వివాదంలో లాగొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.